RNI.No.TELTEL/2000/00272

ASHISH MEDIA SERVICES (AMS)
You can download news from our 'AMS News Agency'
Logon to our website and registar.
www.ashishmediaservices.blogspot.com
Contant No. : 9247698676

Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

రిపోర్టర్లు కావలెను...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.
- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్
సెల్: 9247698676

సంపుటి : 28 ‖ సంచిక : 52 ‖ హైదరాబాద్ ‖ శనివారం, మార్చి 08, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12



# సంపాదకీయం

## బహుజనుల ఆత్మగౌరవ పతాక

దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల త్యాగాలు, భాగస్వామ్యాలు కూడా మరువ లేనివి. అలాగే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ ఒక త్యాగశీలి భాగస్వామ్యం చాలా మందికి తెలియనిది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఝాన్సీ రాణి. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు ఒక చరిత్ర. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది ఝాన్సీ లక్ష్మీబాయి. బ్రిటిష్ పాలనకు లొంగక, వారికి తన రాజ్యం స్వాధీన పరచడానికి ససేమిరా ఇష్ట పడక, రాజ్య రక్షణ కోసం జరిగిన యుద్ధంలో ఝాన్సీ వీరోచిత పోరాటం, వీర మరణం గురించి అందరికీ తెలిసిందే. ఈ పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయికి నమ్మిన బంటుగా, విశ్వాస పాత్రురాలిగా, ఆత్మార్పణం గావించిన ఒక వీరదళిత నారి గురించి చాలా మందికి తెలియదు. ఆమె ఝల్కారీబాయి... ఝల్కారీబాయి గురించి తెలుసుకోక పోవడం చరిత్రకు అన్యాయం జరిగినట్లే భావించాలి. ఉత్తర భారతదేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి లక్ష్మీ బాయి.1857లో అలజడి రేగడంతో ఝాన్సీ పట్టణం విప్లవ కారులకు నిలయంగా మారింది. లక్ష్మీబాయి స్వచ్ఛంద సైన్యాన్ని సమీకరించడం ద్వారా ఆత్మరక్షణ బలోపేతం చేసింది. మహిళలను కూడా సైన్యంలో చేర్చుకుని వారికి ఆయుధ శిక్షణను ఇవ్వనారంభించింది. ఆమె దగ్గర సైన్యాధ్యక్షులుగా ఉన్న వారంతా ఆమె యుద్ధం చేస్తున్న కారణానికి మద్దతుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారే. సెప్టెంబరు, అక్టోబరు 1857 లో ఆమె ప్రక్క రాజ్యాలైన దతియా, ఓర్చా రాజ్యాల నుంచి దాడిని విజయవంతంగా ఎదుర్కొన గలిగింది. హిందువులకు ఆవు పవిత్రం, ముస్లింలకు, పంది అసహ్యం. కానీ ఆంగ్లేయులు వాడే తూటాలకు ఆవుకొవ్వును, పందికొవ్వును వాడేవారు. అది సహించలేని సిపాయిలలో తిరుగుబాటు మొదలయ్యింది. ఇది గ్రహించిన ఆంగ్లేయులు హిందువులను, ముస్లింలను అనేక ఇబ్బందులకు గురిచేసారు. అది సహించలేని సిపాయిలు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేయాలని సంకల్పించు కున్నారు. రాజ్యాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకోగా పారిపోయిన ఝాన్సీలక్ష్మీబాయి తాంత్యాతోపే మొదలైన తిరుగుబాటు దార్లతో చేయి కలిపి ఢిల్లీ, కాన్పూరు, ఔధ్ , ఝాన్సీతో పాటు అన్నీ ప్రాంతాలలో ఒకేసారి తిరుగుబాటు చేయాలని నిర్ణయించు కున్నారు. కానీ బ్రిటీష్ వారు పెట్టిన బాధలకు ఓర్వలేని మంగల్ పాండే అనే భారత సిపాయి తిరుగుబాటు చేయడంపై ఆంగ్లేయులు అప్రమత్తమై ఝాన్సీరాణిని నిర్బంధించి ఝాన్సి రాజ్యాన్ని కైవసం చేసుకున్నారు. ఇది భారత చరిత్రలో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం. భారతనారీ క్షేత్రంలో మచ్చుతునక ఝాన్సీ లక్ష్మీబాయి. అయితే ఈ సమరంలో ఝల్కారీబాయి అనే వీరనారి పాత్ర మరువ లేనిది. ఝల్కారీబాయి (నవంబరు 22, 1830 %–% 1858) భారతీయ మహిళా సైనికురాలు. 1857 సిపాయి తిరుగుబాటు సందర్భంగా జరిగిన ఝాన్సీ యుద్ధంలో ప్రముఖపాత్ర పోషించింది. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలోని మహిళా విభాగంలో సైనికురాలు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సిపాయి తిరుగుబాటుగా, 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధిగాంచిన 1857-58 నాటి వీరోచిత పోరాట ఘట్టంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ప్రతిరూపంగా కీలక భూమికను పోషించిన ఘనత దళిత బహుజన భూమి పుత్రిక ఝల్కారిబాయికే దక్కుతుంది. బుందేల్‌ఖండ్ ప్రాం తంలో ప్రజలు పాడుకునే జానపద బాణీల్లో ఝాన్సీలక్ష్మీబాయి సరసన ఝల్కారిబాయి సాహసాలను పాటల రూపంలో నేటికీ గుర్తు చేసుకోవడం విశేషం. ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో కోరీ కులానికి చెందిన సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు నిరుపేద వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి వీరనారిగా ఎదిగి, నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ పతాకగా మారింది. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుంది. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిన ఘటన సంచలనం రేపింది. ఝాన్సీ లక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్ సింగ్‌ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించింది. సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రు సేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టుముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకుని కల్పి ప్రాంతంలో పోరాడుతున్న తిరుగుబాటు నాయకులను కలుసు కోవడానికి అనువుగా, ఝల్కారీబాయి తానే ఝాన్సీ లక్ష్మీబాయి నంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, తదనంతర కాలంలో ఆమెను విడిచిపెట్టారా లేదా చంపేశారా అన్నది చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1858 జూన్ 17,లో రెండో రోజు యుద్ధములో రాణి మరణించింది. ఈ ఝల్కారిబాయి సాహసంతో స్ఫూర్తి పొందిన దళిత బహుజన రాజకీయ పార్టీల కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఝల్కారిబాయి జీవితాన్ని, పోరాట ఘట్టాలను నాటకాలు, కథలుగా మలచి ఊరూరా ప్రచారం చేయడం జరిగింది. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గమనార్హం.

# మహిళల హక్కుల పట్ల అవగాహన ఏదీ?



అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారు. మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజికం సహా అనేక రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడంతోపాటు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఈ వేడుకలను జరుపుకుంటారు. అయితే వందేళ్లుగా, ఈ వేడుకలు జరుపుకుంటున్నా, నేటికీ మహిళలు అనేక సమస్యల వలయలలో కొట్టుమిట్టా డుతునే ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడానికి కార్మిక ఉద్యమం నేపధ్యం ఉంది. 1908 సంవత్సరంలో మహిళలకు తక్కువ పని గంటలు, మెరుగైన ప్యాకేజీ, ఓటు హక్కు కోసం న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు భారీ ప్రదర్శన చేశారు. మహిళల ఈ డిమాండ్లకు సానుకూలమై, అమెరికాలోని సోషలిస్టు పార్టీ అధికారంలోకి వచ్చాక 1909వ సంవత్సరంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిం చాలన్న ప్రతిపాదన కోపెన్‌హెగెన్ నగరంలో 1910లో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' సదస్సులో చేశారు. 17 దేశాల నుంచి ఈ సదస్సుకు హాజరైన 100 మంది మహిళలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని తొలిసారిగా 1911లో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జ ర్లాండ్ దేశాల్లో నిర్వహించారు. 1917 యుద్ధ సమయంలో రష్యా మహిళలు "ఆహారం - శాంతి" డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు. నాలుగు రోజుల తర్వాత అప్పటి రష్యా సామ్రాట్ నికోలస్ జా 2 సింహాసనాన్ని వదులుకోవాల్సి వచ్చింది. తాత్కాలికంగా ఏర్పాటైన ప్రభుత్వం మహిళలకు ఓటు వేసే హక్కును కల్పించిన నేపథ్యం ఉంది. మహిళలు ఈ సమ్మెకు దిగిన దినం అప్పట్లో రష్యాలో అనుసరించే జూలియన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23 ఆదివారం. అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది మార్చి 8వ తేదీ. అందుకే మార్చి 8వ తేదీన అత్య ధిక దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపు కొంటున్నారు. 1975వ సంవత్సరం లోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా నిర్వహించ టం ప్రారంభించింది. ఈ ఏడాది జరిగేది 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం. 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్: "సుస్థిరమైన రేపటి కోసం ఈ రోజు లింగ సమానత్వం"... అయితే మహిళ లపై అణచివేతలు కొనసాగు తుండడం నిత్యకృత్యాలే అవుతు న్నాయి. రాజ్యాంగం ఎన్నో హక్కు లు కల్పించినా వాటిపై అవగాహన లేక పోవడంతో మరింత అన్యా యాలకు గురవు తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి. తమపై వివక్షను, వేధింపులను ఎదుర్కోవడానికి వారు ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో మహిళా దినోత్సవం సందర్భంగా తెలుసు కోవాల్సిన అవసరం ఉంది. భారతీయ మహిళలందరికిని సమానత్వం( నిబంధన14), వివక్ష లేకుండుట (నిబంధన 15(1), సమానావకాశాలు కల్పించడం (నిబంధన16), సమాన పనికి సమాన వేతనం (నిబంధన 39(డి), వీటితో బాటు స్త్రీలకు పిల్లలకు అనుకూలంగా ప్రత్యేక నిబంధన లను అనుమతించడం (నిబంధన 15(3), మహిళల గౌరవానికి భంగం కల్గించే ఆచారాలను లేకుండా చేయడం(నిబంధన 51(ఎ) (ఇ), అంతేగాక మహిళలు చేసేపనులలో న్యాయపరమైన, మానవోచిత పరిస్థితులలో రక్షణ కల్పించడం, ప్రసూతి సమయంలో ఉపశ మనానికి (నిబంధన 42) మహిళా రిజర్వేషన్ 73వ రాజ్యాంగా సవరణ ప్రకారం సదుపాయాలను అనుమ తించడం వంటి హామీలను భారత రాజ్యాంగం కల్పించింది. సెక్షన్ 100 ప్రకారం ఆత్మరక్షణ కోసం, ఒక వ్యక్తి మీద దాడి చేస్తే సదరు వ్యక్తి చనిపోయినా మీకు శిక్ష పడదు. 166(బి) సెక్షన్ ప్రకారం.. బాధితురాలికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స ఇవ్వకపోతే సంబంధిత సిబ్బంది, యాజ మాన్యం మీద కేసు వేయవచ్చు. 228(ఏ) సెక్షన్ ద్వారా లైంగిక దాడికి గురైన మహిళ అనుమతి లేకుండా మీడియాలో ఆమె పేరు, ఫొటోలు ప్రచురించ కూడదు. అలా చేసిన పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవచ్చు. 354 సెక్షన్ ప్రకారం - స్త్రీ శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో చూసినా, తాకినా, అవమాన పర్చినా, అనుమతి లేకుండా ఫొటో, వీడియో తీసినా ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయ వచ్చు. 376 సెక్షన్ కింద18 ఏళ్ల లోపు ఉన్న యువతితో సెక్సులో పాల్గొంటే అది చట్టరీత్యా వ్యతిరేకం. ఒకవేళ ఆమె ఇష్ట ప్రకారమే చేసినా పురుషుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష పడుతుంది. 376 సెక్షన్ కింద వైద్యం కోసం వచ్చిన మహిళను లైంగిక వేధింపు లకు గురిచేస్తే వారిపై చర్య తీసుకు నేందుకు సెక్షన్ ఉపయోగ పడు తూ, ఈ సెక్షన్ కింద కేసు చేస్తే రెండు నెలల్లో విచారణ చేసి తీర్పు ఇవ్వాలి. భార్య ఉండగా.. మరో పెళ్లి చేసుకుంటే 494 సెక్షన్ ప్రకారం అతని మీద కేసు నమోదు చేయవచ్చు. కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది. 498(ఏ) సెక్షన్- ఓ వివాహితను ఆమె భర్త కానీ, భర్త బంధువులు కానీ శారీర కంగా, మానసికంగా, హింసించినా, అందుకు ప్రేరేపించినా, ప్రోత్సహిం చినా ఈ సెక్షన్ కింద కేసు వేయ వచ్చు. కనీసం మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. 509 సెక్షన్ - మహిళ లతో అవమానంగా మాట్లాడినా, సైగలు చేసినా, అసభ్యకర వస్తువు లను ప్రదర్శించినా ఈ చట్టం ప్రకారం శిక్షకు అర్హులు. ఒంటరిగా ఉన్నప్పుడు అసభ్యకరంగా పాటలు పాడుతూ, శబ్దాలు చేస్తూ ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 294 ప్రకారం వారిపై ఫిర్యాదు చేయవచ్చు. కనీసం మూడు నెలలకు తగ్గకుండా వారికి జైలుశిక్ష, లేదా కొంత జరిమానా వేయవచ్చు. ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా వెక్కిరించినా, అనుకరించినా, వారిపై సెక్షన్ 354(డీ) ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. పనిచేసే ప్రదేశాల్లో తోటి ఉద్యోగులు గానీ, బాస్ గానీ ఆఫీసు పనుల్లో అలుసుగా తీసుకొని సెక్సువల్ కాంటాక్ట్ కోసం ఇబ్బంది పెడితే 2013 వేధింపుల చట్టం ప్రకారం ఫిర్యాదు చేయ వచ్చు. ఒకరి ఫొటోను మార్ఫింగ్ చేసి వారి శరీరాలకు ముఖాన్ని అతికించి ఇబ్బంది కరంగా ఇంటర్నెట్‌లో షేర్ చేస్తున్న సంఘటనలలో సెక్షన్ 499 ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడవచ్చు. ఒక మహిళను దౌర్జన్యంగా, బల ప్రయోగం వల్ల తన శరీరంపై ఉన్న దుస్తులను తీసివేసినా, ఆ వ్యక్తికి సెక్షన్ 354(బీ) ప్రకారం 3నుండి7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. 13/2013 సవరణల చట్టం ద్వారా ఈ సెక్షన్ అదనంగా చేర్చబడింది. ఒక మహిళ, విద్యార్థినికి సంబం ధించిన రహస్య వ్యక్తిగత ఫొటోలు తీయడం, వీడియోలు తీసి వాటిని ఇతరులకు పంపించినా 354(సీ) సెక్షన్ కింద ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వ్యభిచారానికి, 18 ఏళ్లలోపు బాలికను కొనుగోలు చేసినా సెక్షన్ 373 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు జరిమానా విధిస్తారు. బాలికను వ్యభిచారానికి మారేందుకు ప్రోత్సహించినా, ప్రలోభ పెట్టినా సెక్షన్ 366(ఏ) కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించ బడుతుంది. నిండు గర్భిణిని చంపాలనే ఉద్దేశంతో చేపట్టిన ఒక చర్య పర్యవసానంగా ఆమె చనిపోతే నేరస్థుడిపై సెక్షన్ 316 ప్రకారం ప్రాణహరణం కింద, నేరం మోప బడుతుంది. ఆమె మరణించడానికి బదులుగా గర్భంలోని శిశువు మరణిస్తే 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఒక బృందంలోని సభ్యులు ఒక మహిళపై లైంగిక దాడి చేసిన సందర్భాల్లోనూ వారిలో ప్రతి వ్యక్తి నేరానికి పాల్పడి నట్లే పరిగణించ బడుతుంది. సెక్షన్ 376-బీ కింద ప్రతి ఒక్కరికీ 20 ఏళ్లు తగ్గకుండా జీవితఖైదు శిక్ష విధిస్తారు. 13/2013 సవరణ చట్టం ద్వారా ఈ సెక్షన్ సవరించబడింది. స్త్రీ, బాలికను గానీ తన ఇష్టానికి వ్యతిరేకంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకునేందుకు బలవంతంగా అంగీకరించాలని ఒత్తిడి తేవడం, ఆ స్త్రీని అపహరిస్తే బలవంతంగా వివాహం చేసుకునే సెక్షన్ 366 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా పడుతుంది. ఇలాంటి చట్టాల ఎన్నో గురించి మహిళలు అవగాహన కలిగి ఉండాలి. అలాగే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ స్త్రీల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలి. సాటి మనుషులుగా మహిళలకు సామాజిక బాధ్యతగా సహకరించాలి.

# పునర్విభజనపై పునరాలోచన

భారత దేశం అనేక సంస్కృతులు, భాషలు, మతాలు కలిపిన మిశ్రమ దేశం. 'భారత దేశం అంతా ఒక్కటిగా ఉంటుంది' అనే భావన ప్రాచీన కాలం నుంచీ కొనసాగుతున్నది. మన దేశం గొప్పదని, కశ్మీర్ టూ కన్యాకుమారి (ఉత్తరాన్నించి దక్షిణం వరకు) ప్రతి భారతీయుడు ఒక్కటిగా ఉంటారని గర్వంగా చెప్పుకుంటాడు. భరతమాత ముద్దు బిడ్డలమని ప్రతి ఒక్కరూ గౌరవంగా భావిస్తారు. ఇది భారతదేశంలోని అంతర రాష్ట్ర అనుబంధాన్ని, సామరస్యాన్ని చాటుతుంది. కానీ రాజకీయాలు ఈ అందమైన భావనకు ప్రతికూలంగా మారుతున్నాయా? అని చర్చ జరుగుతోంది. భారత్‌లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య క్రమంగా పెరిగిపోతున్న వివక్ష, రాజకీయ వర్గాల మధ్య అసమానతలు, సామాజిక శక్తి సామరస్యాన్ని భంగం చేయడంలో ఎంతగానో పాత్ర పోషిస్తున్నాయి. 8 దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత, ఎక్కువ మంది ఉత్తరాదివారు ప్రధాని పదవిని ఎప్పటికప్పుడు ఆక్రమించుకున్నారు. కానీ దక్షిణాది ప్రాంతం నుండి మాత్రం పివి నరసింహారావు, దేవెగౌడ వంటి ఇద్దరు ప్రధానులు మాత్రమే వచ్చిన సంగతి మనకు తెలుసు. భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టబోతున్నారు. ఈ ప్రక్రియ 2026లో అమలవుతుంది. ఇందులో పార్లమెంట్ సీట్ల సంఖ్య పెరిగిపోతుంది. అయితే, ఈ సీట్లు పెరిగేటప్పుడు దక్షిణాదికి తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని మేధావులు, ప్రజాస్వామ్యప్రియులు భావిస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ప్రాతిపదికన చేపట్టబడుతోంది. దీనితో దక్షిణాది రాష్ట్రాలకు కొత్త ఎంపి సీట్లు సాధించడంలో కఠినతరం అవుతుందని చెప్పబడుతోంది. డీలిమిటేషన్ ప్రక్రియలో కొత్త ఎంపి సీట్లు జనాభా ప్రాతిపదికన కేటాయించబడతాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించడంలో ముందంజలో ఉన్నాయి. వీటిలో మౌలిక విధానాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో అధిక మెరుగుదలతో, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎంతో ముందుంది.

కానీ, ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఆధారంగా, దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు లభించకపోవడం, అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాలలో సీట్లు పెరిగిపోవడం ప్రతికూలతలను సృష్టిస్తుంది. ప్రస్తుత డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా పార్లమెంట్ సీట్ల కేటాయింపును తిరిగి ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రక్రియను ముందే అంచనా వేసి, రెండు సంవత్సరాల క్రితం బిజెపి పాలకులు పార్లమెంట్ కొత్తభవనం నిర్మాణం ప్రారంభించారు. ఇందులో మొత్తం 888 సీట్ల పరిమాణం తో కొత్త భవనం నిర్మాణం చేపడుతూ పార్టీ తమ రాజకీయ లౌక్యాన్ని ప్రదర్శించడంలో పాల్గొన్నారని భావిస్తున్నారు. ఇది పలు ప్రశ్నల్ని కలిగిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పార్లమెంట్‌లో మొత్తం 547 సీట్ల స్థానంలో 846 సీట్లు ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం జాతీయ రాజకీయ వ్యవస్థలో కాంట్రవర్సీని కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు భారీ సంఖ్య లో సీట్లు పొందబోతున్నాయి. ఉదాహరణకు ఉత్తరప్రదేశుకు 80 నుంచి 122 సీట్లు, బీహార్‌కు 40 నుంచి 70 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల చాలా తక్కువగా ఉంటుందని అంచనా. తెలంగాణకు 17 -20, ఆంధ్రప్రదేశుకు 25 -28, తమిళనాడుకు 39-41, కేరళకు 20- 19 సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ పరిణామంలో, ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం పెరిగిపోతుండగా, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగడం మొదలవుతుంది. ఈ పరిస్థితి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ శక్తిని పెంచి, దక్షిణాది రాష్ట్రాల శక్తిని బలహీనపరుస్తుంది. ఇది శాశ్వతంగా ఉత్తరాది ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యవాదులు ఈ పరిణామాన్ని అంగీకరించలేకపోతున్నారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు, దీనిని వాయిదా వేసింది. ఆమె భావన ప్రకారం, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. ఇక్కడ జనాభా నియంత్రణకు కీలకమైన నిర్ణయాలు తీసుకున్న కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉండటంతో, ఈ విధానం అమలుచేస్తే వారి గాయాలు మరింత పెరిగిపోతాయని ఆమె అంగీకరించారు. 2001లో ప్రధానిగా ఉన్న అటల్ బిహారి వాజ్‌పేయీ కూడా దీనికి ఇలాగే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన కూడా ఈ డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేందుకు ప్రయత్నించారు.

ఆయన అభిప్రాయ ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు అనేక రంగాలలో అభివృద్ధిని సాధించడంతో, డీలిమిటేషన్ ప్రక్రియను వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్యాయం చేయకుండా నిర్వహించాల్సిన అవసరం ఉంది. 2026లో జరగబోయే డీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయడం అనేది పెద్ద చర్చకు దారితీస్తుంది. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సీట్లు పెరిగితే వారి రాజకీయశక్తి పెరుగుతుంది. కానీ దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గడంతో వారి ప్రభావం తగ్గిపోతుంది. ప్రజాస్వామ్యవాదులు ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచి, ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే అధిక శక్తి ఇవ్వడం వల్ల రాజకీయ సమతుల్యతకు ముప్పు అని అంటున్నారు. తమిళనాడుకు సీట్లు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డీలిమిటేషన్ ద్వారా ఒక్క సీటు కూడా తగ్గబోదని చెప్పారు. కానీ, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ అమలు చేస్తే తమిళనాడుకు మరింత సీట్లు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోందిడీలిమిటేషన్ ప్రక్రియ ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది ప్రాంతం దక్షిణాది మీద శాశ్వత ఆధిపత్యం ఏర్పడుతుందని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల ఓట్లు, సీట్లు పెరిగితే, దక్షిణాది రాష్ట్రాల ప్రభావం తగ్గి, దేశం ఏకపక్షంగా ఒకే పార్టీ ఆధీనంలో ఉండేలా మారవచ్చని విశ్లేషిస్తున్నారు. కొంత మంది బిజెపి హిందీ బెల్ట్‌లో పట్టు పెంచుకుంటుందని కూడా అభిప్రాయపడుతున్నారు. జనాభా ఆధారంగా జరిగిన డీలిమిటేషన్, బిజెపికి లాభం చేకూర్చే అవకాశం కల్పిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయింపుతో బిజెపి ఒకే పార్టీగా ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక శక్తిని పొందవచ్చు. దీని వల్ల దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడం సులభమవుతుంది. ఇది భారతదేశ రాజకీయ వ్యవస్థలో పెద్ద మార్పును సూచిస్తుంది. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే, వాటి రాజకీయ శక్తి తగ్గిపోతుంది. దక్షిణాది రాష్ట్రాలు ఈ విషయంలో తీవ్ర పోరాటం చేయాలి, ప్రజల్లో చైతన్యం పెరిగి, సమర్థవంతమైన ప్రతిస్పందన ఇవ్వడం అవసరం. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటానికి కీలకమై ఉంటుంది. భారత దేశంలో రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సమతుల్యతపై డీలిమిటేషన్ ప్రక్రియ అనేక ప్రశ్నలను తెస్తోంది. ఈ ప్రక్రియ అమలులోకి వచ్చినప్పుడు దక్షిణాది రాష్ట్రాలు మరింత బలహీనంగా మారే అవకాశం ఉంది. అలాగే ఉత్తరాది రాష్ట్రాలు అధిక శక్తిని పొందవచ్చు. దీనివల్ల భారత దేశంలో ఒక కొత్త రాజకీయ వ్యవస్థ ఏర్పడే అవకాశముంది. డీలిమిటేషన్ ప్రక్రియ భవిష్యత్తులో ఉత్తరాది-దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను భారీగా ప్రభావితం చేసే అవకాశం కలిగినది. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక సీట్లు కేటాయించడం, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాముఖ్యతను తగ్గించే దిశగా పని చేస్తుంది. ఈ పరిణామాల ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుంది. కనుక అవి ఈ అంశంపై తీవ్రం గా ఉద్యమించి, ప్రజలలో చైతన్యాన్ని పెంచుకోవడం అత్యంత అవసరమైంది.

# కథ ఆఖరు భాగం

"రేపటిదాకా ఎందుకూ...శుభస్య శీఘ్రం... తలుచుకున్నపుడే తాత ప్రయాణం " అన్నట్లుగా ఇప్పుడే బయలుదేరదాం. మనం వస్తున్నట్టు పార్వతి కి ఫోన్ చేస్తాను." మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా అయిపోతుంది ".. లేవండి.. లేవండి.." అంది సుమతి..." లేడికి లేచిందే పరుగు ".. మా లేడీ గారు యమ హుషారుగా వున్నారు.. ఉండు పనిలో పని... మా పెదనాన్న కొడుక్కి ఫోన్ చేసి.. ఈ విషయం చెప్పాలి.

" గంతకి తగిన బొంత " అన్నాడుగా... ఇప్పుడు నేను చెప్పే ఈ సంబంధం వాడికి " కుక్క కాటుకి చెప్పు దెబ్బ " అనిపించాలి. " ఇనుము విరిగినా అతకవచ్చుకానీ.. మనసు విరిగితే అతకలేము..".. అంతలా నా మనసుని బాధ పెట్టాడు వాడు. " అన్నాడు కాంతారావు..." పోన్లెండి.. " ఊరందరిదీ ఓ దారి ఉలిపిరి కట్టెదో దారి" వదిలేయండి.. ఆయనని. " గురివింద గింజ తనకింద నలుపెరగదట " మనకెందుకింక ఆయన సంగతి.. ముందు బయలుదేరదాం పదండి" అంటూ భర్త ని తొందరపెట్టింది సుమతి...వెళ్లే దారిలో..."ఏవండీ.. చెప్పడం మర్చిపోయా.. ఇందాక పార్వతీ.. వాళ్ళాయన వచ్చినపుడు మీ అక్కయ్య గారు వచ్చారు.. విషయం అంతా తెలుసుకున్నారు..వాళ్ళు వెళ్ళాక.. తన కొడుక్కి.. శ్రీవల్లి ని ఇవ్వడంలేదని ఉక్రోషం తో.. నానా మాటలు అన్నారు.." ఏ రాయైతేనేం పళ్ళూడకొట్టుకోవడానికి ".. ఆ జాతకాల పట్టింపులు నాకు లేవన్నాను..అయినా నా మాటకి విలువీయకుండా పరాయిసంబంధాలకి పోతున్నారూ.. " కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక పోతుంది" అంటూ.. శాపనార్థాలు పెట్టిందావిడ.." శుభం పలకరా పెళ్ళి కొడకా అంటే పెళ్ళి కూతురు... ఏది ? " అన్నట్టుగా.. ఈవిడ అపశకునపుమాటలేంటీ.. అని బాధేసింది నాకు " అంది సుమతి..." పోనీలే.. మా అక్క సంగతి తెలుసుకదా... నువ్వు ఎందుకు.." గుమ్మడి కాయల దొంగంటే భుజాలు తడుముకుంటావు" పట్టించుకోకు..." గుడ్డి గుర్రానికి పళ్ళు తోమడం " తప్ప దానికి వేరే పనీపాటా లేదు." పనిలేని మంగలి పిల్లి తల గొరిగినట్టు" అది అలా వాగుతూనే వుంటుంది. వదిలేయి తన మాటలు.. ఎప్పుడూ వుండేవేగా.. " అంటూ భార్యని ఓదార్చాడు...పెళ్లి చూపులు అయిపోవడం.. పెళ్లి మాటలు మాట్లాడుకోవడం.. ఆకాశమంత పెళ్ళి పందిరిలో భూదేవంత అరుగు మీద.. కాంతారావు, సుమతి దంపతులు.. పెళ్లి కొడుకు కి కాళ్లు కడిగి కన్యాదానం చేయడం అయిపోయి... అమ్మాయిని అత్తగారింటికి సాగనంపారు...పై పంచతో చెమర్చిన కళ్ళని తుడుచుకుంటూ.." అందరికాళ్ళు మొక్కినా అత్తవారింటికి పోక తప్పదు కదా" అంటూ అనుకున్నాడు ఆ ఆడపిల్ల తండ్రి...ఈ జాతకాలు కుదరడం లేదనే వంకో.. ఈ కుజ దోషం కారణంగానో.. చాలా మంది ఆడపిల్లలకి.. సరైన సమయంలో వివాహం కాకపోవడమో.. అసలు వివాహాలే కాకపోవడమో జరుగుతోంది. వినం ఇంతలా వెల్లివిరిసి.. ప్రపంచం ఆధునికంగా ముందుకు కు సాగిపోతోంటే... ఇంకా ఈ మూఢ నమ్మకాలేంటి ? ఆడపిల్లల జీవితాలకి ఈ జాతకాలు ఓ అడ్డుగోడ.. చదువుకున్నవారిలోనే ఈ జాడ్యం ఎక్కువగా వుంది.. అందరికీ.. మా శ్రీవల్లి చేయందుకున్న వేణుమాధవ్.. ఓ ఆదర్శం కావాలి... అనుకున్నాడు కాంతారావు...ఇంతలో ఫోన్ మోగింది.... ఈ పెళ్ళి కి పిలవలేదుగా.. అందుకే ఈ సంగతి తెలీక ... కాంతారావు పెదనాన్న కొడుకు.... " ఒరేయ్ కాంతారావూ... మీ అమ్మాయికి ఏద్కెనా నా సంబంధం వుంటే చెప్పమన్నావుగా... ఇక్కడ.. ఈ. సేవ లో పనిచేస్తూంటాడు.. నెలకి పదివేలు జీతం .. అతనికీ కుజ దోషం వుందట.. సరిపోతుంది ఇద్దరికీ.. వాళ్ళ నెంబర్ ఇస్తాను.. ఓ సారి మాట్లాడి.. సంబంధం కుదుర్చుకో... నాపేరు చెపితే.. కట్నంలో.. కాస్త తగ్గిస్తారు.. " అన్నాడు..ఆ.. అన్నయ్యా... " దొంగలు పడ్డ ఆరునెలలకి కుక్కలు మొరిగాయట"..అర్థమయిందనుకుంటాను.. " అంటూ ఫోన్ పెట్టేసాడు...(శుభం)వాట్సాప్ లో తారస పడిన సందేశాలలో ఉపయోగకరమైన వాటిల్లో ఇది ఒకటి. ఇలాంటి సందర్భాలలో ఈ సందేశం ఎక్కడి నుంచి పుట్టిందో తెలియదు, రచయిత ఎవరో తెలియదు, కానీ మంచి కథ. సందేశంలో నాకు ఎక్కడ భాషాదోషాలు కనిపించలేదు. భాషాబాధ్యత లేని సందేశం వరదలో ఇది అరుదనే చెప్పాలి. విరివిగా సందర్భోచితముగా సామెతలు వాడారు. నాకు నచ్చిన ఇంకో విషయం జాతకాలు పట్టింపు లేక పోవడం అబ్బాయి తరపు వారికి. అమ్మాయి తరపు వారు కూడా పెళ్లి నిలుపు చేయకుండా వివేకంతో ప్రవర్తించడం. మంచి సందేశం. చిన్న అప్పు కావాలంటే దగ్గరవారికైనా పలు మార్లు ఆలోచించి, పూచికత్తు అడిగే ఈ లోకం రెండు జీవితాలే ఆజన్మాంతం కొరకు ముడిపెట్టేటప్పుడు ఎటువంటి హామీలు కానీ, పరీక్ష కానీ, గత అనుభవ వివరాలువ్ కానీ అడగకుండా జాతకం పై నమ్మకం పెట్టడం. ఇప్పుడిప్పుడే చాలా కొద్దీ మంది కుల, ప్రాంత తదితర సంకుచిత భావాలు వీడి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు, కానీ వారు కూడా కొన్ని అర్ధం కానీ పూర్తి వివరాలు తెలియని జాతకం, గోత్రం లాంటి ఆకర్షణ శక్తి నుంచి బయట పడలేక పోతున్నారు. కొంత మంది అంటారు గోత్రం దగ్గర సంబంధాలను నివారిస్తుంది అని, కానీ మేనరికం పెళ్లిళ్లు జరుగుతున్నాయి కదా! ఇదేమి తర్కం? కొంచెం సత్యాన్వేషణ జరిపి తెలివిగా ముందు తరాల వారైనా వ్యవహరిస్తారని ఆశిద్దాం.

సీతా రామ రాజు సనపల

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు.




కరీంనగర్ టౌన్ మార్చ్ 07 (వుదయం) గణితానికి మరియు సైన్స్ కు ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపు వున్నదని మరియు విజయాలలో కీలకంగా వ్యవహరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తరగతిగదుల్లోని విషయాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా విశ్లేషిస్తు వివిధ అంశాలపట్ల పట్టు సాధించాలని కోరారు. పట్టు సాధించిన వారిని వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా పాఠశాలలో వివిధ అంతర్జాతీయ మరియు జాతీయ సంస్థలతో నిర్వహింపబడే పలు పోటీ పరీక్షలకు ఎంపిక చేయడమే కాకుండా వారికి అన్నిరకాల వనరులను కల్పించాలని తద్వారా ఉత్తమమైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ప్రాథమికంగా విద్యార్థులకు నిపుణుల సమక్షంలో పరీక్ష నిర్వహించి అందులో అద్భుతంగా రాణించిన వారికి బహుమతులతో పాటు నగదు పారితోషకాలు సైతం అందజేస్తారని చెప్పారు. ఈ క్రమంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన నేషనల్ టీచర్స్ ఫౌండేషన్ వారు నిర్వహించినటు వంటి జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్లో పాఠశాలకు చెందినటు వంటి జి. సహర్ష్, 6వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, డి. చంద్రహాస్, 6వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, యన్.సహర్ష్, 7వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, ఇ. లిఖిత్ కుమార్, 7వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం, కృష్ణ ప్రతీక్, 9వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, జి. హేమంత్ జాదవ్, 9వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం మరియు జి. సాయి సంహిత్, 8వ తరగతి, బంగారు పతకం మరియు జాతీయ స్థాయి 2వ ర్యాంకు.జాతీయ స్థాయి సైన్స్ ఒలంపియాడ్:జి. విభువన్ రామ్, 4వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం, డి. అనుశ్రీ, 6వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, కృష్ణచైతన్య, 7వ తరగతి, బంగారు పతకం మరియు ప్రశంసా పత్రం, కె. తనీష్ రెడ్డి, 9వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం.ఆల్ ఇండియా ట్యాలెంట్ సర్చ్ (ఎ.ఐ.టి.యస్.ఇ):యన్. వినాయక్, 7వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం మరియు జి. సాయి సంహిత్, 8వ తరగతి, రజత పతకం మరియు ప్రశంసా పత్రం.విజేతలందరికి పుష్పగుచ్చాలను అందజేసి భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏక్తా యాంటీ కరప్షన్ రాష్ట్ర అధ్యక్షులుగా మీర్ బర్కత్ అలీ హష్మి



హైదరాబాద్,మార్చి07(వుదయం ప్రతినిధి): ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ ఆల్ ఇండియా చీఫ్ జనరల్ సెక్రటరీ కె అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఏక్త యాంటీ కరప్షన్ నూతన అధ్యక్షులుగా మీర్ బర్కత్ అలీ హష్మి ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కె.అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ఏక్త యాంటీ కరప్షన్ కు తెలంగాణ రాష్ట్రంలో ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మీర్ బర్కత్ అలీ హష్మి ను అధ్యక్షులుగా ఎన్నుకోవడం హర్షనీయంగా ఉందన్నారు. మీర్ బర్కత్ అలీ హష్మిన్ మాట్లాడుతూ ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ తన పై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నుకొన్నందుకు సంస్థ పెద్దలకు ధన్యవాదములు తెలిపారు. సంస్థ అభివృద్ధి కొరకు, పేద మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కొరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏక్తా యాంటీ కరప్షన్ ఆంధ్ర రాష్ట్ర ఇంచార్జ్ షేక్ నాసిర్ అహ్మద్, తమిళనాడు రాష్ట్ర ఇన్చార్జ్ షేక్ మహబూబ్ బాషా, నెల్లూరు జిల్లా సెక్రటరీ జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మన్నే వెంకట్రాములు వర్ధంతి



నారాయణపేట టౌన్ మార్చ్ 07(వుదయం ప్రతినిధి)నారాయణపేట పట్టణంలో ఇటీవలే మరణించిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మన్నే వెంకట్రాములు వర్ధంతి వేడుకలను శుక్రవారం ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన గతంలో చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.ఆయన వార్డులో గతంలో చేసిన అభివృద్ధి పనులను మరోసారి ప్రజలకు వివరించారు. అంతేకాక పట్టణంలో కూడా ఆయన చేసిన సేవలను చిరస్మరణీయమని పలువురు వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య, బిజెపి పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్,టౌన్ బిల్డర్ వెంకట్ రాములు, కథలప్ప, నక్క సత్యనారాయణ, కాకర్ల శ్రీనివాస్ లతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వెలమ సంఘం డివిజన్ అధ్యక్షుడు బచ్చు.



ఖానాపూర్ మార్చి 7 వుదయం ప్రతినిధి.మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన కత్తల సంపత్ రావుఅరుణ దంపతుల కుమారుని వివాహ రిసెప్షన్ కు వెలమ సంఘం డివిజన్ అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్ రావు హాజరై నూతన వధూవరులు కత్తల దయాకర్ రావుఆశా లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు నడిపెల్లి రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి సంపత్ రావు, హెడ్ కోటర్ వెలమ సంఘం అధ్యక్షుడు పల్లెల్ల సోమేశ్వర్ రావు, సభ్యులు తక్కలపల్లి దేవేందర్ రావు, గంద్ర రాజు, ఆరెల్లి రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ నేల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్



సంగారెడ్డి జిల్లా (మార్చ్3) వుదయం దినపత్రిక జహీరాబాద్
ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన రంజాన్ మాసంను ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాతిక్మక చింతన, దానాలు, ధర్మాలు చేపడతారు. నెలవంకతో ప్రారంభమైన రంజాన్ మాసం.. మళ్లీ నెలవంక రాకతో ముగుస్తుంది. అల్లా అనుగ్రహం మీకు ఎల్లవేళలా ఉండాలని, మీ జీవితాన్ని సుఖశాంతులతో ఆనందంగా గడపాలని కోరుకుంటూ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్

## పరీక్ష కేంద్రాలను సందర్శించిన డిఎస్పి రాములు



కోరుట్ల మార్చి 07 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన పలు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను శుక్రవారం మెట్పల్లి డివిజన్ పోలీస్ అధికారి రాములు సందర్శించారు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు పరీక్షా కేంద్రాల వద్ద ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమంలో డిఎస్పి రాములు తో పాటు కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి సిఐటియు



దమ్మపేట, మార్చి07(వుదయం ప్రతినిధి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని , కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మల్టీవర్పన్ విధానాన్ని రద్దు చేయాలని,గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల అకౌంట్లో వేతనాలు చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలలోవివిధ రకాల పారిశుద్ధ్య పనులు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సేవలు అందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వారి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించడం లేదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని గత జనవరిలో ప్రకటించి నేటికీ రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఆ వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మారిచిందని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికుల వేతనాలు కు బడ్జెట్ కేటాయించే విధంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని ,కార్మికుల బకాయిల వేతనాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యాని విడనాడాలని ఎస్టిఒ లలో నిలిచిపోయిన కార్మికుల వేతనాలు విడుదల చేయాలని ఎండల తీవ్రత ను దృష్టిలో పెట్టుకొని ఒక పూట పనికి ఉత్తర్వులు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు విజయలక్ష్మి, యశోద తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులదాడులకు అడ్డుకట్ట వేయాలి

### గో ఇండియా ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టరు మేరి కీరణ్ పాల్ పిలుపు

### గో ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు





సంగారెడ్డి జిల్లా ( మార్చ్ 7) వుదయం దినపత్రిక జహీరాబాద్ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుదాడులకు అడ్డుకట్ట వేయాలని గో ఇండియా ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టరు మేరి కీరణ్ పాల్ పిలుపునిచ్చారు. సమాజంలో అనునిత్యం ఎక్కడో చోట మహిళలపై వేధింపులతో పాటు లైంగిక దాడులు కూడా జరుగుతూనే ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారంనాడు జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (తెలుగు,ఉర్దూ మీడియం) ప్రాంగణంలో మహిళలపై జరుగుతున్న వేదింపుల లైంగిక దాడులు, అరికట్టే చర్యలు అనే అంశంపై విద్యా ర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపుల లైంగిక దాడులను ఏ విధంగా అరికట్టాలో అన్న విషయమై క్లుప్తంగా వివరించారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల దాడులను సరైన సమయంలో సరైన విధంగా అరికట్టకపోతే సమాజంలో మరిన్ని అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు స్పందించి అలాంటి దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి వక్కాణించారు. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం విద్యార్థులకు మహిళలపై ప్రస్తుతం జరుగుతున్న వేధింపులు, లైంగికదాడులను ఎలా? అరికట్టాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విచ్చలవిడిగా జరిగే అవినీతి, అక్రమాలపై సవివరమైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు అరికట్టాల్సిన చట్టాలు, సమాజంలో నడుస్తున్న అవినీతి అక్రమాలు, ఎలాంటి సమయంలో ఎలాంటి నంబరుకు కాల్ చేయాలో అన్న విషయమై పూర్తి వివరాలు గో ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా, ప్రేమ ప్రలోభాలతో మిస్సింగ్ కేసులు, కిడ్నాప్ కేసులు, గంజాయి, ఇతర అలవాట్లకు లోనవ్వడం, అవయవ దోపిడి, ఫోక్స్ కేసులు, గృహహింస కేసులు నమోదవుతున్న అంశాల తాలుకు విషయాలు తెలిపారు. వీటి వలన అమ్మాయిలను, మహిళలను అక్రమ రవాణా చేసి, వ్యభిచార గృహాల్లోకి అమ్మి వేస్తున్నారని, అబ్బాయిలను కర్మాగారాలు, బాల కార్మికులుగా మారుస్తున్నారని తెలిపారు. వీటి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ ప్రమాదాలకు బయట వాళ్ళు కాకుండా తెలిసిన వారే నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. కావున ప్రతీ గ్రామంలో తల్లీ, తండ్రి, బాలికలు, బాలుడు, ఏ విధంగా అవగాహన కలిగి ఉండాలనేది గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలే సురక్షిత గ్రామాలన్నారు. మై ఛాయిస్ ఫౌండేషన్ వారి సహకారంతో పిల్లలకు ఉచితంగా కామిక్ బుక్స్ అందజేశారు. ఆపత్కాలంలో 100, 1098, 181, 18004198588 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గో ఇండియా సిబ్బంది నర్సిములు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బస్వరాజ్, సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు సమ్రిన్ సుల్తానా, నవీద్, గ్రామ తాజా మాజీ సర్పంచి కె.మాణిక్ రెడ్డి, గ్రామ ప్రముఖులు కె. నర్సిములు,ఆలం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

అన్నపురెడ్డిపల్లి మార్చి 7 :( వుదయం ప్రతినిధి )
రేపు అనగా ది శనివారం ఉదయం 8:30 AM నుండి 10:00 AM వరకు 33/11 సబ్ స్టేషన్ పెంట్లం నందు మరమ్మత్తులు కలదు కావున ఈ కింది గ్రామాలకు అన్నపురెడ్డిపల్లి భాస్కరపురం ,తొట్టి పంపు , వద్దుగూడెం, వెంకటాపురం, బుచ్చన్న గూడెం, మర్రిగూడెం, పెంట్లం, నామవరం, రాజాపురం, భాస్కర పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును.కావున వినియోగదారులు మరియు రైతులు సహకరించగలరని కోరుతున్నాము...

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

బోథ్, మార్చి07(వుదయం ప్రతినిధి): ఇచ్చోడ మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొనసాగుతున్న పొలంబాట మట్టి రోడ్డు పనులను మండల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు.

## పలు వివాహాలకు హాజరై వధూవరును ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.





ఖానాపూర్ మార్చి 7 వుదయం ప్రతినిధి.మండలంలోని పలు గ్రామాలలోని బిఆర్ఎస్ పార్టీ నాయకుల కుమారుల వివాహ రిసెప్షన్లకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన కత్తల అరుణసంపత్ రావు దంపతుల కుమారుడు దయాకర్ రావుఆశా, కొత్తూరు గ్రామానికి చెందిన జాటోత్ ఎల్లయ్యనీలా దంపతుల కుమారుడు రాజువైష్ణవి, బద్రుతండకు చెందిన గుగులోతు బాషాలక్ష్మి దంపతుల కుమారుడు సంతోష్ ఉజ్వల, చిలకమ్మనగర్ గ్రామానికి చెందిన బానోతు హరిలాల్ లక్ష్మి దంపతుల కుమారుడు మురళీకృష్ణసాన్వి ల వివాహ రిసెప్షన్లకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది పాల్గొని నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ గూగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ జడ్పిటిసి బత్తిని స్వప్నశ్రీనివాస్ గౌడ్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కోరే సుధాకర్, భగత్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ కత్తల వెంకటేశ్వర్ రావు, నాయకులు రామసహాయం ఉపేందర్ రెడ్డి, గుగులోతు అశోక్, గుగులోతు సుమన్, జాటోతు సదర్ లాల్, బందారపు శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గీత హాస్పిటల్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



నారాయణపేట టౌన్ మార్చ్ 07(వుదయం ప్రతినిధి) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ వైద్యులు గీత విశ్వనాథ్ దంపతులు శుక్రవారం తమ హాస్పిటల్ లో మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు టిఫిన్ బాక్స్ లను పంపిణి చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు కుటుంబానికి పట్టుకొమ్మ గా సమాజానికి దిక్సూచిగా నిలిచే మహిళ అన్నిరంగాల్లో రాణించాలని సమాజంలో మహిళలను మగ వారితో సమానంగా చూడాలని మహిళలను గౌరవించాలని సృష్టి కి మూలం స్త్రీ అని అన్నారు. అనంతరం మిఠాయిలను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మలక్ చించోలిలో ఉచిత వైద్య శిబిరం

నిర్మల్, మార్చి07(వుదయం ప్రతినిధి): నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మలక్ చించోలి గ్రామంలో శ్రీ వందన హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎండి ఫిజీషియన్ డాక్టర్ దుర్గాప్రసాద్, వల్లకొండా సురేష్ గౌడ్, సతీష్ కుమార్, మైస శేఖర్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు
ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, అంబటి గంగాధర్, అయిటి కార్తీక్, గుండా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

కాగజ్‌నగర్, మార్చి07(వుదయం ప్రతినిధి): కాగజ్ నగర్ పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి దాటుతున్న క్రమంలో అదుపుతప్పి లారీ డివైడర్ పైకి దూసుకెళ్లింది. రాత్రి 10. 30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో రహదారిపై ప్రజలు, ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**అదనంగా మరో వెయ్యి ఇండ్లు**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



వెల్దండ మార్చి 7 (వుదయం ప్రతినిధి) పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు పేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు శుక్రవారం మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నాగమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు గ్రామంలో 24 మందికి ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ యాదవ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, చెరుకూరు మాజీ సర్పంచ్ రేవతి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్,, సురేందర్ రెడ్డి, పర్వత్ రెడ్డి,, పిఎసిఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్, తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన





మధిర,మార్చి07(ప్రుదయం ప్రతినిధి)మధిర పట్టణం లోని హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7, 8 ,9వ తరగతుల విద్యార్థులను క్షేత్ర పర్యటనలో భాగంగా మధిర వ్యవసాయ పరిశోధనా కేంద్రమును శుక్రవారం సందర్శించారు. సీనియర్ శాస్త్రవేత్తలు, ప్రధాన ఆచార్యులు దేవి పంట మార్పిడి అవశ్యకత, పంటకాలం పూర్తి అయిన తర్వాత రైతులు పంటకి సంబంధించిన వ్యర్థ పదార్థాలను తగలబెట్టడం వల్ల వాతావరణంలో విష వాయువులు అధికమవుతున్నాయని, దీని ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడుతుందని, ఋతువులు మారుతున్నాయని, సునామీ , భూకంపంలు సంభవిస్తున్నాయని విద్యార్థులకు తెలియజేశారు. కావున విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు ఈ విషయాలను తెలియజేయాలని పంటానంతరం వ్యర్థ పదార్థాలను, తగలబెట్టకుండా వారికి అవగాహన కల్పించాలని తెలియజేశారు. అదేవిధంగా ఈ క్షేత్రంలోని ఎంటమాలజీ విభాగపు శాస్త్రవేత్త నాగస్వాతి వెదర్ స్టేషన్లోని విభాగాలైన రెయిన్ గేజ్, ఓపెన్ పాన్ ఎవాపరేషణ్ యూనిట్, అనిమోమీటర్, సన్ షైన్ రికార్డర్, సాయిల్ థర్మ మీటర్, కంది, పెసర, మినుము, పంటల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులు, పంట సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. వరి పంట మార్పిడి , మధిర గ్రీన్ గ్రామ్ ఎం జి జి 295 రకం గురించి వివరించారు. విద్యార్థులకు ఇలాంటి క్షేత్ర పర్యటనలు జరపటం ద్వారా పంటల పట్ల అవగాహన చేశారు. అదే విధంగా నూతన రకాల వంగడాల గురించి, సేద్య పద్ధతుల గురించి తెలుసుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమం నిర్వహణలో పాల్గొన్న బయాలజీ ఉపాధ్యాయులను, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎన్ విజయశ్రీ , పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు ఎన్ వై ఎన్ భట్టాచార్య, షేక్ లాల్ అహ్మద్, షేక్ నాగూర్ వలి , కె. రాజ్యలక్ష్మి , శంషాద్, సమతా , జీవన ప్రశాంతి , గుర్రం శ్రీను, కొలగాని శ్రీను , ఎస్ నరసింహారావు , ఎం రాజశేఖర్ , ఆర్ విజయలక్ష్మి బి చైతన్య , వి శంకరావు అభినందించారు.

# విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో సెయింట్ పీటర్స్ విజయభేరి




హనుమకొండ, మార్చి 07(ప్రుదయం జిల్లా ప్రతినిధి) : జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మా సెయింట్ పీటర్స్ విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించుటకు యజుర్ పబ్లిక్ స్కూల్లో జరిగిన విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని ప్రథమ బహుమతిగా 5000 రూపాయల చెక్కును రెండవ తరగతి విద్యార్థులు జేమ్స్ మరియు కఫీరా, ద్వితీయ బహుమతిగా 3000 రూపాయల చెక్కును రెండవ తరగతి విద్యార్థులు దేవాన్ష్ మరియు దీపాన్ష్, తృతీయ బహుమతిగా 1000 రూపాయల చెక్కును అబ్రార్ మరియు ఫైజాన్ కురేషి, మరియు కాన్సోలేషన్ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ తో పాటుగా అన్ని రంగాలలో పాల్గొని జిల్లా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో కూడా విజయం సాధించి సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్లస్ టు విద్యార్థులు విజయ శంఖారావం పూరిస్తున్న సందర్భంగా పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ కం ప్రిన్సిపల్ జి మత్స్ రెడ్డి గారు,
డైరెక్టర్ జి సునీత రెడ్డి గారు ప్రతిభ ప్రదర్శించిన ప్రతి విద్యార్థిని క్యాష్ అవార్డ్స్ ఇచ్చి సత్కరించారు. పిల్లల సహకరించిన ఉపాధ్యాయులందరినీ అభినందించారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





నిజాంసాగర్, మార్చి 07 (ప్రుదయంప్రతినిధి): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ, గున్కుల్, తుంకి పల్లి, గాలిపూర్, తెల్గాపూర్ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన సి.సి రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మధిర లో పర్యటించిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి





మధిర,మార్చి07(ప్రుదయం ప్రతినిధి) ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మధిర లో పర్యటించారు. పర్యటనలో భాగంగా ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కోట రాంబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తేనీటి విందుకు హాజరయ్యారు. విచ్చేసిన ఎంపీ కి డాక్టర్ కోట రాంబాబు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఇటీవలే కె.వి.ఆర్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభించిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మధిర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలను పరిశీలించారు. మరియు మధిర లో ఇంతకముందు నిలిపిన రైళ్లను మళ్ళీ పునరుద్ధరించాలని మరియు ఆగని కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లను కూడా మధిర లో నిలిపేలా చూడాలని ఎంపీ ని కోరారు. రైల్వే మంత్రి తో మాట్లాడి మధిర నియోజకవర్గం మీద ప్రత్యేక దృష్టి సారిస్తాను అని, అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు మరియు రైళ్ల హాల్టింగ్ కొరకు కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, టిఎసి సభ్యులు అమరవాది సత్యనారాయణ రెడ్డి, సత్యం బాబు, కటికల సీతారామి రెడ్డి, కర్నాటి రామారావు, యట్టగుంట రమేష్, చావలి రామరాజు, సంగయ్య, కపిలవాయి సత్యనారాయణ రాజు, లక్ష్మారెడ్డి, డేవిడ్, కోట జయరాజు, అక్కినపల్లి నాగేశ్వరరావు, బాహాటం శ్రీనివాసరాజు,కాశి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మధిర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





మధిర,మార్చి07(ప్రుదయం ప్రతినిధి) దాచేపల్లి రాము మానవుడు అయాన్స్ విరాట్ పుట్టినరోజు సందర్భంగా మధిర సేవాసమితి ఆధ్వర్యంలో ఆదరణ ఫౌండేషన్ లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సౌత్ ఆఫ్రికాలో పుట్టినరోజులు వేడుకలు జరుపుకుంటూ ఇండియాలో తన తాత ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను సేవాసదనంలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వారికి ఉన్న సేవ గుణం మరువలేని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు పెళ్లిరోజు సందర్భంగా అనాధాశ్రమాలలో పేదలకు అన్నదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లబోతు ప్రసాదరావు, మువ్వ రామకృష్ణ, జంగా నరసింహారెడ్డి, దాచేపల్లి ముత్యాలు,చెడే రామకోటేశ్వరరావు, చల్లా సత్యనారాయణ,సామినేని రామనాథం, లింగంపల్లి అప్పారావు, నంబూరి మురళీకృష్ణ, షేక్ సైదా,మహంకాళి వెంకట శ్రీనివాసరావు, ఇన్ స్టైల్ రాము, ఒట్టే సైదులు, మహిళా సభ్యురాలు వనపర్తి కళావతి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారిత దిశగా ముందుకు సాగాలి

## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.









నారాయణపేట టౌన్ మార్చ్ 07 (ప్రుదయం ప్రతినిధి) మహిళా సాధికారిత దిశగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. కలెక్టర్, జిల్లా మహిళా అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నేడు జిల్లా కేంద్రాలలో జిల్లా స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందనీ, శనివారం హైదరాబాద్ లో రాష్ట్రస్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పండగ వాతావరణంలో చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ మహిళకు వ్యక్తిగత, కుటుంబ జీవితం ఉంటుందని, ఉద్యోగ పరంగా చాలామంది మహిళలు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఒక మహిళకు మరో మహిళే సపోర్ట్ చేయాలన్నారు. మహిళలంతా చైతన్యమై ఏదైనా అవసరం కలిగిన మహిళకు సాయం అందించాలన్నారు. మహిళా దినోత్సవాన్ని కేవలం రెండు రోజులే కాకుండా నిత్యం చేసుకోవాలన్నారు. ఇతర జిల్లాల మహిళలకు మనం స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి మహిళా అధికారులు పురుషులతో సమానంగా కృషి చేయాలన్నారు. అందరికీ మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపారు.

అమ్మతో పోల్చే దేశం మన భారత దేశం...

భారత మాత అని ఓ తల్లి పేరిట పోల్చే దేశం మనది అని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి తాను రావడం ఆనందంగా ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో జిల్లా పరిపాలన అధికారి( కలెక్టర్) తో పాటు ఆర్డీవో, జెడ్పీ సీ ఈ ఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, కలెక్టరేట్ ఏ ఓ, డీ డబ్ల్యు ఓ, ఇలా జిల్లా అధికారులందరూ మహిళలే ఉన్నారని, ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే నారాయణ పేట లో జరుగుతున్నట్లు లేదని, హైద్రాబాద్ రవీంద్రభారతిలో జరుగుతున్న అనుభూతి తనకు కలుగుతుందన్నారు. జిల్లాలోని మహిళా అధికారులు అంకితభావంతో పనిచేస్తారని కొనియాడారు. దేశంలోని మంచినీటి నదులన్నీ మహిళల పేరుతోనే ఉన్నాయని, ఆ నదులన్నీ వెళ్లి కలిసే సముద్రం మగవాడి పేరిట ఉన్నా సముద్రంలో ఉప్పు నీరు ఉంటుందని, అది తాగడానికి రాదని తెలిపారు. ఈ దేశంలో మహిళలకి ఎంతో గౌరవం ఉందని, సాంప్రదాయ మహిళా ఎలా ఉండాలో మన దేశంలోని మహిళను ప్రపంచ దేశాలకు చూపించే స్థాయి మనదే అన్నారు. కట్టు బొట్టు నిండుతనానికి మన భరతమాత నిదర్శనం అన్నారు.

ఝాన్సీ లక్ష్మీ, జిజియా బాయి, మొదటి మహిళా టీచర్ అయిన సావిత్రి బాయిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నేడు దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగుండి కుటుంబాలు నిల దొక్కుకుంటున్నాయంటే అది మహిళల వల్లే సాధ్యం అవుతోందన్నారు. స్త్రీ లేకపోతే సృష్టే లేదన్నారు. ఒక ఇంటిని చక్కగా నడిపే వ్యవస్థ ఆ ఇంటి యజమానురాలిదే అన్నారాయన. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళల పేరిటే అమలు చేస్తోందని చెప్పారు. రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కావాలని, రాజ్యసభ,6 చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఉండాలని కోరుకునే వాళ్లల్లో తాను ఒకడిని అన్నారు. జిల్లాలోని మహిళలందరికీ తాను ఒక సోదరుడిలా అండగా ఉంటానని భరోసా ఇస్తూ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో పాటు జిల్లా స్థాయి మహిళా అధికారులను అందరిని ఆయన శాలువా తో సన్మానించారు. అలాగే మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్ తో కలిసి ఆయన జ్ఞాపికలను అందజేశారు. జిల్లా అధికారినిలకు కలెక్టర్, ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకు ముందు కార్యక్రమాన్ని ఉద్దేశించి సభాధ్యక్షురాలు డి డబ్ల్యు ఓ జయ, జెడ్పి డిప్యూటీ సీఈవో జ్యోతి, ఆర్డీవో మేఘా గాంధీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ అఖిల ప్రసన్న, డిఆర్డిఓ మొగులప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో జయసుధ, జి సి డి ఓ నర్మద, నారాయణపేట, మక్తల్, మద్దూర్ సిడిపిఓలు, సూపర్ వైజర్లు, అంగన్ వాడీ టీచర్లు, వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల సమాఖ్య అధ్యక్షురాలిగా జి అనిత

నిజాంసాగర్ మార్చి 07(ప్రుదయం ప్రతినిది): నిజాంసాగర్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బూర్గుల్ గ్రామానికి చెందిన జి అనిత నియామకమయ్యారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో నిజాంసాగర్ మండల సమాఖ్య జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర జగదీష్, వివో అధ్యక్షురాళ్లు, ఏటీఎం ఏం.రామనారాయణ గౌడ్, సీసీ లు, అకౌంటెంట్ పాల్గొనగా మండల సమాఖ్యకార్యదర్శి గా నర్సింగరావు పల్లి వివో జి సావిత్రి, కోశాధికారి గా అరేడు వివో ఎన్. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషం

జనగామ, మార్చి07(ప్రుదయం ప్రతినిధి): పోటీ ప్రపంచంలో మహిళలు పురుషులతో దీటుగా చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సంతోషకరమని హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ దినోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. మహిళలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని కోరారు.

# పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(ప్రుదయం ప్రతినిధి) పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్, పంచాయతి అధికారులను ఆదేశించారు శుక్రవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో మున్సిపల్, గ్రామ పంచాయతిల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించుట, వేసవిలో మొక్కల సంరక్షణ చర్యలు తదితర అంశాలపై మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్థాలు సేకరణ జరగాలని ఆదేశించారు. వ్యర్ధాలు ఆరుబయట వేస్తే జరిమానాలు విధించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చికెన్, చేపలు, మాసం విక్రయించే వ్యాపారులకు అలాగే నిత్యావసర సరుకులు విక్రయించే వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు చేయొద్దని నోటీస్ జారీ చేయాలని సూచించారు. నాన్ వెజ్ వ్యర్ధాలు రహదారుల వెంబడి వేస్తున్నారని, నోటీసులు జారీ చేసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం ప్రకారం జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పరిశుభ్రతా నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరించిన వ్యర్థాలతో డంపింగ్ యార్డుల్లో వర్మీ కంపోస్టు తయారీ చేయాలని, అట్టి వర్మీ ఎరువులు మొక్కలకు. వినియోగించాలని తెలిపారు. వ్యర్థాలను ఆదాయ వనరుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, వాటికి సమయానికి నీరు అందేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్యాంకర్ల లో నీరు వేడిగా ఉంతుందని, అలాంటి నీళ్లు మొక్కులకు పోయడం వల్ల చనిపోతాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంజూరునగర్ నుండి సింగరేణి నివాస గృహాలకు వెళ్లే దారిలో వ్యర్థాలు వేస్తున్నారని, నియంత్రణ చర్యలు చేపట్టాలని, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫంక్షన్ హాళ్లు, మద్యం దుకాణాల వద్ద వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యర్థాలు కాల్చితే కఠిన చర్యలు తీసుకోవడంతో జరిమానా విధించాలని, నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు చేయొద్దని నోటీస్ జారీ చేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టి జరిమానా విధించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీఓలు, పంచాయతి కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే జారె





మార్చి 7 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించిన స్థానిక శాసనసభ్యులు

జారె ఆదినారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ అధికారులు పారిశుద్ధ్య కార్మికులు వివిధ శాఖల సిబ్బందితో కలిసి ప్రధాన రహదారి పై రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలను తొలగించి రహదారిని పరిశుభ్రంగా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు పరిశుభ్రత జీవితంలో ప్రతి వ్యక్తికి చాలా ప్రాముఖ్యమైనదని మన పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యమే కాకుండా మన సమాజం కూడా శుభ్రంగా ఉంటుందని పేర్కొన్నారు కార్మిక సోదరులు కూడా ఎంతో కష్టపడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం కొందరి బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశించిన ప్రదేశాలలో ఉంచి పంచాయితీ సిబ్బందికి సహకరించాలన్నారు అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఈ నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు ఈ సందర్భంగా దమ్మపేటలోని కొందరు ప్రముఖులు మాట్లాడుతూ చాలామంది గతంలో ఉన్నాయి ఎమ్మెల్యేలు ఫోటోలు మాత్రమే ఇచ్చి వెళ్లిపోయే వారిని కానీ ఇప్పుడున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఉదయం 6 గంటల నుంచి దరిదాపు 11 గంటల వరకు పనిచేస్తూ అధికారులను కాంగ్రెస్ నాయకులను తోటి కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో స్వయంగా పనిచేస్తూ పలువురితో శభాష్ అనిపించుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు, కె క్కిరాల రమేష్, పగడాల రాంబాబు, చిన్న శెట్టి యుగంధర్, ఎండిఓ, పంచాయతీ కార్యదర్శి అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు కాంగ్రెస్ అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఓ మహిళ నీ సాధికారత ఎక్కడ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లావూ దయం ప్రతినిధి( బోడపాటి వరప్రసాద్ )పుట్టినింట మెట్టినింట వంటింటనెట్టింట ఎంటర్ప్రెన్యూర్స్ గాను వివిధ రంగాల్లో రాణిస్తూ మహిళలు ఉన్న నేటికీ వారికి మహిళా సాధికారత దూరంగానే జరుగుతూ ఉంది అసెంబ్లీ పార్లమెంట్

ఎగువ సభ దిగువ సభవార్డు నెంబర్ దగ్గర నుండి రాష్ట్రపతి ప్రధానమంత్రిఎన్ని పదవులకు నీవు వన్నెతెచ్చిన మహిళకు మహిళా సాధికారత అనేది డిజిటల్ యుగంలో కూడా మహిళకు దూరం అవుతూనే ఉంది మహిళా రిజర్వేషన్ పుణ్యమా అనిపంచాయతీ సర్పంచ్ గాను వార్డు మెంబర్ గాను జడ్పిటిసి ఎంపీటీసీ ఎంపీపీ ఇతర పదవులు ఎన్నిచేసిన మహిళలకు మహిళా సాధికార త




అనేది ఎండమావిగానే మిగులుతుంది పెనిమిటి చాటు ప్రెసిడెంట్లుభర్త చాటు భార్యలునేటికీఆయా కార్యాలయాల్లో ఆయా స్థానిక సంస్థల్లోనూ భర్తల పెత్తనం నేటికీ వెక్కిరిస్తూ ఉంది మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఉన్నతమైన ఆశయంనేటికీ వారి భర్తల రూపంలో హరిస్తూనే ఉన్నారు ఎన్నెన్నో మహిళా దినోత్సవాలు మరెన్నో ఉపన్యాసాలు ఇవన్నీ మహిళా సాధికారతను ఎక్కిరిస్తూనే ఉన్నాయి ఇప్పటికైనా బట్టల పెత్తనం లేని కార్యాలయాలు చూడాలని కోరిక మహిళామణుల్లో బలంగా ఉంది ఏదైనా కార్యాలయంలో భార్య తరపున భర్త పెత్తనం చేస్తూ కనిపిస్తేఆ ఎన్నికను రద్దుచేసి తిరిగి మరల ఎన్నిక జరిపేలా ఉంటేఈ భర్తల ప్రమేయం తొలగిమహిళా సాధికారత ఆవిష్కృతమవుతుంది ఇప్పటికైనా ఆ దిశగా ప్రభుత్వ ప్రయాణించాలని ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోరుకుందాం

# మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి సోపానం

## ఎంపీడీవో కె.రవీందర్





సంగెం మార్చి 7 వుదయం ప్రతినిధి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యం లో మహిళలకోసం పనిచేసే స్థానిక వ్యవస్థ లసమన్వయం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఎంపీడీవో కే రవీందర్ హాజరై మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతం అయినప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మహిళల అభివృద్ధి కి, సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు,అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆకాశమే హద్దుగా మహిళలు సామాజికం గా, ఆర్థికం గా,విజ్ఞాన పరం ముందడుగు వేశారని, అన్ని రంగాలలో అసమాన ప్రతిభను కనబర్చి దీటుగా రాణిస్తున్నారని అన్నారు. మహిళ కు అండగా చట్టాలు, సంస్థ లు ఉన్నాయని,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళ లకు ఉచిత న్యాయ సహాయం అందించి,ఆమెకు చేయూత ను అందిస్తుందని అన్నారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోవాలని,వాటిని ఉపయోగించు కొని అభివృద్ధి చెందినప్పుడే సాధికారత సాధ్య మని అన్నారు. అనంతరం డాక్టర్ క్రాంతి మాట్లాడుతూ లింగ నిష్పత్తి లో తేడాకు లింగ వివక్ష కారణం అని, గ్రామాలలో మొదట ఆడపిల్ల పుట్టి రెండవసారి గర్భం అని తెలియగానే బయట స్కానింగ్ తీయించు కొని గర్భ విచ్చితి చేయించుకుంటున్నారని, అది చట్టరిత్యా నేరమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఐ నరేష్ మాట్లాడుతూ ఉజ్వల భవితకు పునాది విద్యార్థి దశ ఈ సమయంలో సరైన మార్గంలో వెళ్లేలా చూస్తే బాగుంటుందని అన్నారు. కుటుంబం లో చిన్నప్పటి నుండి ,పిల్లల అలవాట్లు, మాటలు పర్యవేక్షణ చేయాలని అవసరం అయిన జాగ్రత్త లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సి హెచ్ ఓ చిన్నాబాయ్, ఐ సి డి యస్ సూపర్వైజేర్ ఈశ్వరి, సర్వోదయ సంస్థ ఇందిర, వనిత,సూపర్డెంట్ ఓంకార్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, వివోఏ లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించిన ఎంపీడీవో



పరకాల మార్చి 7 (వుదయం ప్రతినిధి): అంతార్జీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ పరకాల కార్యాలయములో మండల పరిధిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించిన ఎంపీడీవో పెద్ద ఆంజనేయులుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ఎదుగుతున్నారని అయినప్పటికీ కుటుంబంలో ఎవరి పాత్ర వారు పోషించినప్పుడే సుఖ సంతోషాలతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ యన్ శ్రీలత, కార్యాలయ పర్యవేక్షకులు సిహెచ్ శైలశ్రీ, ఈ టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, పంచాయతీ కార్యదర్శులు బి. సుమలత , మహ్మద్ రిజ్వానా, కంప్యూటర్ ఆపరేటర్ అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమల లను సన్మానం చేయడం జరిగింది

ఈసీ రజనీకాంత్ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు..

# పరకాల మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్

కె. విజయభాస్కర్.



పరకాల మార్చి 7 (వుదయం ప్రతినిధి): పరకాల మండల ప్రత్యేక అధికారిగా భాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ కె వెంకటనారాయణ జాయింట్ డైరక్టర్ గా పదోన్నతి పై ఖమ్మం జిల్లాకు వెళ్ళినందున వారి స్థానంలో జిల్లా పశు వైద్యాధికారిగా భాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె విజయ భాస్కర్ పరకాల మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం రోజున విధులలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని సాధ్యమైనంత వరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు పర్యవేక్షకులు సిహెచ్ శైలశ్రీ స్వాగతం పలుకుతూ శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

## జనరిక్ మందులపై అవగాహన కార్యక్రమం

గజ్వేల్, మార్చి07(వుదయం ప్రతినిధి): గజ్వేల్ పట్టణంలోని జనరిక్ మెడికల్ షాప్‌ను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు శుక్రవారం సందర్శించారు. జనరిక్ మందులపై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు తక్కువ ధరకు అత్యుత్తమమైన ఔషధాలు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి పరియోజన ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఫార్మసీ నిపుణులు, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తడి చెత్త పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వూ దయం ప్రతినిధి (బోడపాటి వరప్రసాద్ )రామచంద్రపురం మండలం వెల్ల గ్రామపంచాయతీలో ఈరోజు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద తడి చెత్త పొడి చెత్త పై మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులకు మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి సర్పంచ్ వీర బోయిన సూరిబాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ్యోతి వారు మరియు విస్తరణాధికారి ఎన్ సెలెక్ట్ రాజు కార్యక్రమ నిర్వహణపై శిక్షణ ఇవ్వగా గ్రామ మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు మంచం ఈశ్వరరావు అన్యం వెంకన్న అన్యం జానకి రామయ్య తదితర గ్రామస్తులు హాజరైన ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామాలన్నీ పరిశుభ్రంగా మరియు ఆరోగ్యంగా ఉండడానికి వాటి నిర్వహణ మండలంలోని ప్రతి పంచాయతీ కార్యదర్శులు తడి



చెత్త పొడి చెత్త పై గ్రామస్తులకు అవగాహన పెంచుతూ ప్రతి ఇంటి నుండి క్లాప్ మిత్రుల ద్వారా తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరణ చేసి చెత్త నుండి తయారు సంపతద తయారీ కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుని వాటిపై ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని క్లాప్ మిత్రులకు కూడా తగిన రీతిలో ఆదాయం పెంచే విధంగా ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా సూచించారు దీనికి ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించవలసిందిగా ప్రజా ప్రతినిధుల ప్రజలందరినీ ఈ విధానానికి అలవాటు పడేటట్లుగా సూచించాలని, ప్రభుత్వ అధికారులు ప్రజలు అందరు సమిష్టి కృషితో ఈ విధానాన్ని అమలు చేయాలని సూచించారు గ్రామంలోని పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ,మండలడ్వాక్రా యానిమేటర్లు,మండలంలోని అందరు ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతాభివందనాలు

## కాంగ్రెస్ నాయకులు , పోలే రాజు మాదిగ, కాటిక రామస్వామి

వెల్దండ మార్చి 7 (వు దయం ప్రతినిధి) దశాబ్దాల కాలంగా మాదిగలు చేస్తున్న ధర్మ యుద్ధానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటిక రామస్వామి, పోలే రాజు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల కాలంగా అలుపెరుగని పోరాట ఫలితమే ఎస్సీ, ఏబిసిడి వర్గీకరణ అని వారి సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఉద్యమ కష్టాలు తెలిసినది కాబట్టే వర్గీకరణకు మద్దతు ప్రకటించాలని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం యావత్ మాదిగ ప్రపంచం రేవంత్ రెడ్డికి కృతజ్ఞులై ఉంటారని సందర్భంగా వారు గుర్తు చేశారు. స్వార్థ రాజకీయాల కోసం కొన్ని రాజకీయ శక్తులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పండిన చివరికి మాదిగల ఆకాంక్షన నెరవేరిందని ఎమ్మార్పీఎస్ వర్గీకరణ కోసం జరిగిన ధర్మ యుద్ధంలో అంతిమ విజయం మాదిగ లేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈనెల 6న జరిగిన తెలంగాణ రాష్ట్ర కేబినెట్లో ఏబిసిడి వర్గీకరణ ముసాయిదా



బిల్లుకు ఆమోదం తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ మంత్రి వర్గానికి రాష్ట్ర నేతలకు మాన్యులో మందకృష్ణ మాదిగ వారు ప్రత్యేకంగా కృతజ్ఞ్యాభినందనలు తెలియజేశారు

# రాములోరి కోటి-గోటి తలంబ్రాల కార్యక్రమం.

## -ముఖ్య అతిధిగా పాల్గొన్న తహసీల్దార్.

బయ్యారం(వుదయం ప్రతినిధి)మార్చి 7.భద్రాద్రి రామునికి ప్రతి ఏటా సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాలు తయారుచేయుటకు శ్రీరామభక్తులు సర్వసన్నదమై భక్తిశ్రద్ధలతో తలంబ్రాలను తయారుచేస్తారు.దానిలో భాగంగా మండలకేంద్రంలోని శ్రీ రామచంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోటి-గోటి తలంబ్రాల కార్యక్రమంలో భాగంగా రామాలయంలో గోటితో తలంబ్రాలు వలిచే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బయ్యారం మండల తహసీల్దార్ బి.విజయ పాల్గొని శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం



భక్తులందరితో కలిసి స్వామి వారి తలంబ్రాలు వలిచారు.తాలంబ్రాల వలిచే కార్యక్రమ అనంతరం తహసీల్దార్ విజయ ను రామాలయ ఆలయ కమిటీ తరపున శాలువా తో ఘనంగా సత్కరించారు.వడ్లను గోటితో వలిచి తలంబ్రాలను శుద్ధకరణతో శ్రీరామ, జయరామ,నామ స్మరణ జపం చేస్తూ తయారు చేయాలని కమిటీ వారు రామ భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణారెడ్డి,కొల్లా వెంకటేశ్వరావు,సత్తిబాబు,మైస్,సుదర్శన చార్యులు,ఉప్పలయ్య,పూర్ణిమ,శారద,సరిత,ఉషారాణి,శ్రావణి,అనూష,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.!

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మర్చి 07(వుదయం జిల్లా ప్రతినిధి) : బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శుక్రవారం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని హనుమకొండ జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగెల్ చిత్రపటానికి కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ రాంకుమార్ రెడ్డి, సునీత పూలమాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అమ్మాయిలు పట్టుదలతో




ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. బాలికలు ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలన్నారు. విద్యార్థినుల చదువులు, ఉద్యోగాల్లోనూ ముందు నిలవాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత సేవలు అందించే వృత్తులలో నర్సింగ్ ఒకటని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సేవలందించడంలో నర్సుల సేవలు ఎంతో ప్రాముఖ్యమైన వని అన్నారు. మహిళా దినోత్సవం నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు

అద్భుతంగా నృత్యాలు చేశారని, మహిళా దినోత్సవ ఏర్పాట్లు చాలా బాగున్నాయని అన్నారు.

కేఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు శక్తిమంతులు, ధైర్యవంతులు అని అన్నారు. మహిళలు ఎంతోమంది ప్రపంచ వ్యాప్తంగా భిన్న రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని అన్నారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు వివిధ రంగాలలో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని అన్నారు. విద్యార్థినులు ఉన్నత స్థానం సాధించాలని ఆకాంక్షించారు. మహిళా దినోత్సవ నేపథ్యంలో కళాశాల విద్యార్థినులు స్పందిస్తూ తమ తల్లినే స్ఫూర్తి అని పేర్కొన్నారు. తాము జీవితంలో లక్ష్యం చేరేందుకు తల్లి ప్రోత్సాహంతో ముందుకు సాగేలా స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

మహిళా దినోత్సవం నేపథ్యంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల గొప్పదనం తెలియజేస్తూ ప్రదర్శించిన నృత్యాలు కేరింతలు పెట్టించాయి. నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎస్సీలను ఏ బి సి డి లుగా వర్గీకరించండి..

## ఏకుశంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి.



పరకాల మార్చి 7 (వుదయం ప్రతినిధి): పరకాల మండలం కామరెడ్డి పల్లి గ్రామంలో కొయ్యడ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఏకు శంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ముఖ్య అతిథిగా విచ్చేసి కామారెడ్డి పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం నాయకులతో డప్పులలతో ర్యాలీని నిర్వహించి అనంతరం మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణను ఏ బి సి డి లుగా వర్గీకరించండి అని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేశారు.ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ద్వారానే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని లేకపోతే ఏ బి సి లుగా ఉంటే 57 కులాలకు విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో అవకాశాలు కోల్పోతారని అణగారిన వర్గాలకు కూడా వర్గీకరణ ఫలాలు దక్కాలని ఉద్దేశంతో మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా ఉద్యమం ద్వారా సాధించిన ఫలితాలను కుడి చేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాకున్నట్టుగా కంచంలో మెతుకుల్ని కాలితో తన్నినట్లుగా అవుతుందని గుర్తు చేస్తూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏ బి సి డిలుగా వర్గీకరించి ఆమోదింప చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి పల్లె గ్రామ శాఖఅధ్యక్షుడు హనుమకొండ విజయ్ మాదిగకొయ్యడ అఖిల్ తిక్క రాజు,నాగెల్లి రఘు,కొయ్యడ జశ్వంత్, కొమరయ్య కొయ్యడ రాజేష్ శ్రీపతి శివాజీ తిక్క యశ్వంత్ మాదిగలు మరియు కామారెడ్డి పల్లె గ్రామ మాదిగకుల పెద్దలు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా రూరల్ సిఐ రజిత రెడ్డికి అభినందనలు తెలిపిన యస్ బి ఐ సిబ్బంది.



కోదాడ టౌన్ మార్చి 7(వుదయం) నిత్యం సవాళ్లతో కూడుకున్న పోలీసు శాఖలో మహిళా ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని కోదాడ పట్టణ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ కారిలాల్ పటేల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోదాడ రూరల్ సిఐ రజిత రెడ్డిని మహిళా కానిస్టేబుల్ లకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఆదర్శంగా తీసుకొని ధైర్యంగా ఎదగాలన్నారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వంశీకృష్ణ, క్యాష్ ఆఫీసర్ నందన రెడ్డి, ముడియాల భరత్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో మెనూ అమలు తీరు బెష్ : కలెక్టర్

మెదక్, ( 2025 మార్చ్ 07 వుదయం ప్రతినిధి : శుక్రవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలో స్టేడియం వద్ద గల తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. తదుపరి మెనూ అమలుతీరును పరిశీలించి




బాలికలతో మమేకమై , వారితో కలిసి భోజనం చేసి ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, విద్యా బోధన అంశాలను ప్రశ్నలతో పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యసాధన శ్రమించాలి. భయం వీడి.. పట్టుదలతో చదవాలి ఎస్ ఎస్ సి పరీక్షలు జీవితానికి టర్నింగ్ పాయింట్ అని అన్నారు.పట్టుదలతో చదవి మెరుగైన ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు, తమ ఊరికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, ఎంఈఓ నీలకంఠం, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీటి సరఫరా పై వ్యవసాయ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి : కలెక్టర్



మెదక్, ( 2025 మార్చ్ 07 వుదయం ప్రతినిధి : శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ తో కలిసి మండల వ్యవసాయ అధికారులు మరియు వ్యాసాయ శాస్త్రవేతలతో సాగునీటి వినియోగంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సమీక్షించారు. వరి వంటకు అందుతున్న సాగు నీటి వినియోగ పరిస్థితిని, రిజర్వాయర్ల లోని నీటిమట్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కాలువలను సందర్శించాలని నీరు వృధా కాకుండా చూడాలన్నారు. నీటి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పొదుపుగా వినియోగించుకునేలా అవగాహన కలిపించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి కొరత రాకుండా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ సంబంధిత మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ బాయ్స్ హై స్కూల్లో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం.



కోదాడ టౌన్ మార్చి 7(వుదయం) కోదాడ పట్టణం లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు సిబ్బందిని పూలు,శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి. సలీం షరీఫ్ మాట్లాడుతూ మహిళలు ఏ పనినైనా వేగవంతంగా పూర్తి చేయగలుగుతారని కొనియాడినారు. నేటి బాలికలు చైతన్యంతో ఆలోచించి చదువుకుంటే,భవిష్యత్తులో మహిళాభ్యున్నతి సాధ్యమన్నారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరం సహకరించాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులు మీనాక్షి, పద్మావతి, హేమలత, కళ్యాణి, రేణుక, సునీల, రాణి, పద్మ పాఠశాల సిబ్బంది విజయ, అంజమ్మ, అరుణ ను సన్మానించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ సీనియర్ ఉపాధ్యాయురాలు వి.మీనాక్షి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా ఎస్పీగా కె.నరసింహ



కోదాడ సూర్యాపేట మార్చి 7(వుదయం) సూర్యాపేట జిల్లా ఎస్పీగా కె.నరసింహను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీ గా విధులు నిర్వహిస్తున్న సన్ ప్రీత్ సింగ్ డీ ఐ జీగా ప్రమోషన్ రావడంతో వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా బదిలీ అయ్యారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు, డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఎంతో కృషి చేశారు.

# జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన



జన్నారం,మార్చ్ 7(వుదయం విలేకరి) జనరిక్ మందుల వినియోగంపై ప్రజలలో అవగాహన పెంచుతున్నామని మంచిర్యాల జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ అన్నారు.శుక్రవారం జన్నారం పట్టణంలో ఏర్పాటు చేసిన జన ఔషధీ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ జనరిక్ మందులు మంచి నాణ్యతతో తక్కువ ధరకు లభిస్తాయని వెల్లడించారు.ప్రజలు కూడా జనరిక్ మందులను వినియోగించేలా అవగాహన పెంచుతున్నామని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జన ఔషధీ దుకాణ యజమాని అనిల్, పలువురు వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు పొనకల్ లో ప్రత్యేక మహిళా గ్రామసభ



జన్నారం,మార్చ్ 7(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక మహిళా గ్రామ సభను ఏర్పాటు చేశామని గ్రామ ఈవో రాహుల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం 10 గంటలకు పొన్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక మహిళా గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రముఖులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

# ఈస్ట్ జోన్ నూతన డీసీపీ గా అంకిత్ కుమార్



హనుమకొండ, మార్చి 07(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంకిత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ట్రైనీ ఐ. పి. ఎస్ గా పని చేశారు.ప్రస్తుతం డీసీపీ గా వున్న రవీందర్ సిఐడి విభాగం ఎస్పీగా బదిలీ అయ్యారు

# మోడల్ స్కూల్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోండి : ప్రిన్సిపల్




మెదక్, ( 2025 మార్చ్ 07 వుదయం ప్రతినిధి : 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశం కోసం మార్చి 10వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోమటిపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన పరీక్ష ఉంటుందని తెలిపారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఇన్సూరెన్స్ డబ్బులను అందజేస్తున్న నాగార్జున డైరీ యాజమాన్యం

హుస్నాబాద్, మార్చి07(వుదయం ప్రతినిధి): హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో నాగార్జున డైరీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల క్రితం మరణించిన పాడి రైతు శాత బోయిన కొమురయ్య అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు నాగర్జున డైరీ ఆధ్వర్యంలో 40, 000 ఇన్సూరెన్స్ డబ్బులను శుక్రవారం ఉదయం అందచేశారు.

# వేధింపులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం.. ఎస్ఐ సౌజన్య



బెల్లంపల్లి, మార్చి7 (వుదయం ప్రతినిధి) గృహిణులు, మహిళలు, యువతుల పై వేధింపులకు గురిచేసే ఆకతాయిల పై కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని మాదారం ఎస్ఐ సౌజన్య హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ లో మహిళా దినోత్సవం సందర్భంగా వుదయం ప్రతినిధితో శుక్రవారం ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజలంతా లింగ సమానత్వంతో ఉండాలని, మహిలళే కదా అని చిన్నచూపు చూసే వారి పై చట్టం కొరడా ఝులిపిస్తుందని అన్నారు. బాలిక దశ నుంచి ఉన్నతంగా చదివించాలని, సమాజం పట్ల అవగాహన ఉండేలా తల్లిదండ్రులు పెంచాలని సూచించారు. బాల్యవివాహాలు చేసేవారి పై కొత్తగా వచ్చిన చట్టాలు కఠినంగా వ్యవహరిస్తాయని, ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. చిన్నపిల్లలకు సెల్ ఫోన్లు ఇచ్చి, వాటికి బానిసలయ్యేలా చేయొద్దని, ఈ విషయం పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడి, డబ్బు పోగొట్టుకోవద్దని, నేరగాళ్ల వలలో పడితే మొదటి గంటలోనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేస్తే, అకౌంట్ ఫ్రీజ్ చేసి, అదే గోల్డెన్ అవర్ లో డబ్బును కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలు, పనిచేసే ప్రదేశాల్లో షీ టీం నిఘా ఉందని, ఒకవేళ వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని ఆకతాయిల పై కొరడా ఝులిపిస్తారని చెప్పారు.

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలంటే భయపడి కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సవాల్ గా తీసుకుని రాయాలని విద్యార్థులు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు!



హనుమకొండ, మార్చి 07(వుదయం జిల్లా ప్రతినిధి) : పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ,హనుమకొండ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్య క్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ సభ్యులుడా. కడియం కావ్య మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో మహిళలు ప్రతి రంగంలో రాణిన్తూ మహిళా సాధికారతకు దోహదపడుతున్నారు .విద్యా, ఆర్థిక స్వావలంబన మరియు ఆరోగ్యం పై అవగాహన ఈనాటి ప్రతి మహిళలకు చాలా అవసరం . మహిళా సాధికారతక కొరకు శారీరక ,మానసిక బలాలతో పాటు స్త్రీ సహజ స్వభావమైన సంకల్ప బలం కూడా అతి ముఖ్యమైనది. మనం ఏది ఆలోచిస్తామో అదే జరుగుతుంది .కాబట్టి ప్రతి విద్యార్థినీ ఉన్నత లక్ష్యాలను ఆశయాలను నిర్మించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనీ ,తద్వారా తన కుటుంబానికి, కళాశాలకు, దేశానికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న కళాశాల నిర్వాహకులను,మహిళా సిబ్బందిని అభినందిస్తున్నాననీ అన్నారు. ప్రిన్సిపాల్ కార్యక్రమంలోమాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లి ఋణం తీర్చుకోలేనిదనీ,ఓర్పుకు,సహనానికి మరోరూపమే మహిళ అని,తాను పింగిళి మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ గా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా.పి.అరుణ మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంతోషిస్తారని అంటూ కళాశాలలో విద్యార్థినులకు చదువుతోపాటుకరాటే విద్యను కూడా నేర్పిస్తున్నామనీ తద్వారా మహిళలల స్వీయ సంరక్షణకు అధిక ప్రాదాన్యత కల్పిస్తున్నామని అన్నారు .కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి.సుహాసిని,ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డా .సురేష్ బాబు,అకడమిక్ కో ఆర్డినేటర్ డా. ఎం.అరుణ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు.తదనంతరం ముఖ్య అతిథి,వరంగల్ పార్లమెంట్ మెంబర్ డా.కడియం కావ్యనుశాలువా,మెమోంటో,పుష్పగుచ్ఛంఅందించి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సంస్కృతిక కార్యక్రమాలు,ఆట,పాటలు,సరదా గేమ్స్ అలరించాయి.ప్రోగ్రాంలో

ఎన్ ఎస్ ఎస్ 1,2,3 యూనిట్

ప్రోగ్రాం అధికారులు కవిత,రామా రత్నమాల,డా. వి.మమత,

అధ్యాపకులు సుజాత,హెప్సిబా,సువర్ణ,

డా.లక్ష్మీ కాంతం , డా.సునీత, రాజేశ్వరి,రేణుక,

శ్రీలత,అరుణ, ఉదయశ్రీ,

ప్రశాంతి, జ్యోతి,సుభాషిణి,ప్రతిభ,భారతి,సుమలత పాల్గొన్నారు. కళాశాల మహిళా సిబ్బందికి అధ్యాపకులు

సామ్యూల్ ప్రవీణ్ కుమార్,శ్రీనివాన్, మధు,సారంగపాణి,రాంరెడ్డి,రాజిరెడ్డి,లకన్ సింగ్,యుగంధర్ మరియు బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

### కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభను జయప్రదం చేయండి

# మార్చి 11 న చలో ఖమ్మం

### కొత్తగూడలో పోస్టర్ ఆవిష్కరణ




కొత్తగూడ మార్చి 07(వుదయం ప్రతినిధి )సిపిఐ ఎం. ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అమరుడు కామ్రేడ్ రాయల. సుభాష్ చంద్రబోస్ ( రవన్న) 9 వ వర్ధంతి సభ ను జయప్రదం చేయాలని ఈ రోజు కొత్తగూడ మండల కేంద్రంలో సిపిఐ ( ఎం ఎల్ న్యూడెమెక్రసీ కామ్రేడ్ పాలు అడుగు కృష్ణ స్మారక భవనం ముందు ఆవరణంలో ఇడంపాక శ్రీశైలం సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి అధ్యక్షతన వాల్ పోస్టర్లను ఆవిష్కరించాడం జరిగింది.అనంతరం జరిగిన కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు హలవత్ లింగ్య,గుజ్జు దేవేందర్ లు మాట్లాడుతూ కామ్రేడ్ రవన్న భారతదేశంలో ను విప్లవాల ప్రభంజనం వీచిన కాలం లో దేశంలో నక్సల్బరీ రైతాంగ సాయుధ పోరాటం ప్రత్యామ్నాయ పోరాట పంథా ను నిర్మాణాన్ని ఎజెండా గా మన ముందుకు తీసుకువెళ్లాడం లో చాల కీలక భూమిక పోషించి ఉప్పెన లా ఎగిసే పోరాటాల్లో విద్యార్థులను, యువకులకు అగ్ర భాగాన నిలిపారు. కామ్రేడ్ రవన్న చారుమజుందార్ రాజకీయాలతో ప్రభావితమై తన డిగ్రీ మూడువ సంవత్సరం చదువుని వదిలేసి అజ్ఞాత జీవితం చేపట్టాడు కామ్రేడ్ రవన్న అప్పటి నుండి 2016 మార్చి 9 న తను తుది శ్వాస వదిలే వరకు ప్రతిఘటన పోరాటం వారిదిగా నిలిచి 47 సంవత్సరాలు కఠిన రహస్య జీవితాన్ని కొనసాగించాడని వారు అన్నారు. భారత విప్లవోద్యమం లో అనేక మంది విప్లవ వీరులు తమ అమూల్యమైన ప్రాణాలను తృణ ప్రాయం గా అర్పించారని అలాంటి వారి గొప్ప ఆశయాలను సాధించే వరకు మనమంతా అవిరామరంగా పోరాడాలని. వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలి అన్నారు. మార్చి 11 న ఖమ్మం పట్టణంలో జరిగే కామ్రేడ్ రవన్న 9వ వర్ధంతి సభ ను విజయవంతం చేయాలనిఈ సభకు ముఖ్య వక్తలు గా న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సాధినేని. వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర నాయకులు పి. ప్రసాద్, గౌని. ఐల్లయ్య,ఆవునూరి. మధు, యం. శ్రీనివాస్, ఝాన్సీ,వి. కోటేశ్వరరావు, బండారి. ఐల్లయ్య, నాగన్న, తదితరులు ప్రసంగిస్తారు కానుక ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై కామ్రేడ్ రవన్న వర్ధంతి సభ ను విజయవంతం చేయాలని కోరారు.ఈ ఫోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ ఎం. ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బుర్కా వెంకటన్న తో పాటు పసునూరి రాజమల్లు, తాళ్లపల్లి రాయుడు, వెంకన్న, శ్యామల, రమ,తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో యువజనరంగానికి అధిక నిధులు కేటాయించాలి

## యూత్ డిక్లరేషన్ హామీలన్నింటిని అమలు చేయాలి – డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటి



హైదరాబాద్,మార్చి07(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే వార్షిక బడ్జెట్ లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని,యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్ అనగంటి వెంకటేష్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హమినిచ్చింది.అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి గురించి ఊసేత్తడం లేదని అన్నారు.రాబోవు వార్షిక బడ్జెట్ లో నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయించాలని,యువతకు ఉ పాధి అవకాశాలకు 1000 కోట్ల రూ, లతో యూత్ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు.యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్స్,పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలెండర్ ను ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ నియమకాలను చేవట్టాలన్నారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి నాలుగువేల రూపాయలు ఇవ్వాలని అన్నారు.గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేయడంతో తీవ్రమైన ఇబ్బందులుపడ్డారు.కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలు చేపట్టాలన్నారు.యూత్ డిక్లేరేషన్ హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.తిరుపతి,గడ్డం వెంకటేష్,జావెద్,శివవర్మ,క్రిష్ణనాయక్,జి.కార్తీక్ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్,హష్మీ,నరేష్,శ్రీకాంత్,ప్రవీణ్,సాగర్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి ఒత్తిడి

**ప్రజావాణిలో పోస్టు కార్డులు అందించిన తెలంగాణ జాగృతి ఇటీవల పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత**



హైదరాబాద్: ఎన్నికల సమయంలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి ఒత్తిడి పెంచింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రికి రాసిన 10 వేల పోస్టు కార్డులను శుక్రవారం నాడు ప్రజా భవన్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యుటీ కలెక్టర్ ర్యాంకు అధికారిణి పుష్పలత తెలంగాణ జాగృతి నాయకులు రంగు నవీన్ ఆచారి, మారిపల్లి మాధవి, రూప్ సింగ్ అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుతస్తున్నా కూడా ఇంకా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దీన్ని తక్షణమే అమలు చేయడంతో పాటు గత 14 నెలల బకాయిని కలుపుకొని ప్రతీ మహిళకు రూ 35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఎమ్మెల్సీ కవిత గారి నాయకత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పుడు కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే పోస్టు కార్డులు పంపించామని, ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి కూడా పోస్టు కార్డులతో ముంచెత్తుతామని తెల్చిచెప్పారు. ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలో ఆడబిడ్డలకు తెలంగాణ జాగృతి బాసటగా నిలుస్తుందని తెలిపారు. ప్రజావాణికి వెళ్లిన వారిలో జాగృతి నాయకులు నరేందర్ యాదవ్, సంతోష్ , మారయ్య తదితరులు ఉన్నారు.

## పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకోవాలి

మక్తల్, మార్చి07(వుదయం ప్రతినిధి): బ్యాంకుల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. శుక్రవారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల దొంగతనాలు జరిగిన నేపథ్యంలో బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లపై సలహాలు, సూచనలు చేశారు. సెక్యూరిటీ గార్డు ఎల్లప్పుడూ అలర్ట్ గా వుండి విధులు నిర్వహించాలని, బ్యాంకు పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

# ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి)ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్, పంచాయతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియ పూర్తి చేయు అంశంపై మున్సిపల్, పంచాయతీ అధికారులకు ఒక శిక్షణా కార్యక్రమం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత ఇంటి స్థలాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణకు జిల్లా వ్యాప్తంగా 8312 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు దారునికి క్రమబద్ధీకరణ సమాచారం ఇవ్వాలని, సోమవారం మున్సిపాలిటీతో పాటు అన్ని మండలాల్లో దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించి క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అమలులో వేగం పెంచే కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరులోగా ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాయితీ ఈ నెలాఖరు వరకు మాత్రమే వర్తిస్తుందని దరఖాస్తు దారులు ఈ వన్ టై రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మున్సిపల్, పంచాయతి కార్యాలయాల్లో దరఖాస్తుదారుల సౌకార్యార్థం హెల్ప్ డెస్క్, కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజువారీగా దరఖాస్తులు క్రమబద్ధీకరణను సమీక్షించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు అధికంగా ఉన్న మండలాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ అమలులో పలు వెనులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం తగు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అన్ని మండలాల ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సవాళ్ల ను అధిగమిస్తేనే సాధికారత

## ఎస్పీ కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి)ఆధునిక సమాజంలో మహిళలు సాధికారత సాధించాలంటే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఈ నెల 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి,విధి నిర్వహణలో రాణించిన మహిళా పోలీసులకు, భరోసా, సఖి, సిబ్బందికి ఎస్పి సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉందని, వారు ఏదైనా సాధించగలరని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు వివిధ రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు.మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, జిల్లా పోలీసు శాఖలో పలు విభాగాల్లో మహిళ పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని, పోలీసు స్టేషన్ లో రిసెప్షన్ విధులు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్, రైటర్ వంటి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, గృహ హింస మరియు వైవాహిక వివాదాలలో బాధితులైన మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అనేక రకాల విధులను మహిళా పోలీసు అధికారులు నిర్వహిస్తున్నారని అభినందించారు. మహిళా అధికారులందరూ పోలీసు శాఖలో భాగమై సమాజానికి చేస్తున్న సేవను పేర్కొంటూ, మహిళలు పలు రంగాలలో సాధిస్తున్న విజయాలు రానున్న తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, మహిళా అధికారులందరూ ధైర్యంగా ఉండాలని, తమ వృత్తిపరమైన బాధ్యతలను గౌరవంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా మహిళా సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పి వేముల శ్రీనివాస్, డిపిఓ ఏ ఓ ఫర్హానా, భరోసా కోఆర్డినేటర్ మానస, సఖి కోఆర్డినేటర్ గాయత్రి, ఎస్సై శ్రీలత, జిల్లా పరిధిలోని వివిధ విభాగాల మహిళ కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



చిట్యాల మార్చి 07 (వుదయం ప్రతినిధి): చిట్యాల మండలంలో గ్రీన్ గ్రోవ్ పాఠశాల లో ముందస్తు మహిళా దినత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యమంలో భాగంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మాతృమూర్తులకు,మహిళా ఉపాధ్యాయులను,పాఠశాల పరిసర ప్రాంతాలలో కూడా పరిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు, విద్యార్థులు అంతర్జాతీయ మహిళా దినోత్సవ విశిష్టతను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, పాఠశాల ఏవో పోల గోవర్ధన్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



చిట్యాల మార్చి 07 (వుదయం ప్రతినిధి)బీ చిట్యాల మండలంలోని తాళ్ల వెల్లంల ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేయడం జరిగింది.విద్యాశాఖ మంత్రిగా పరిణీత, ఎమ్మెల్యేగా అజయ్, కలెక్టర్ గా పవిత్ర, డి ఈ ఓ గా శశివర్ధన్, ఎమ్మార్వో గా పూజ, ఎంపీడీవో గా కోమల కుమారి, ఎంఈఓ గా రుత్విక, హెచ్.ఎం గా మమత తమ బాధ్యతలను చక్కగా నిర్వర్తించారు. తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం అభినందనలు తెలిపి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి శంభయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నక్క స్వప్న, ఉపాధ్యాయులు ఎండి అయూబ్ పాషా, ఎం శ్రీనివాసులు, ఏ ఆంజనేయులు, వి కిరణ్ కుమార్, ఎం లింగారెడ్డి, కె కాటమయ్య, ఏ. మౌనిక, పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ నీ సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల మున్సిపల్ కమిషనర్ వీరేందర్ చిట్యాల మార్చి 07(వుదయం ప్రతినిధి)బీ చిట్యాల పట్టణంలో 2020 సం వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ ఆర్ ఎస్ కొరకు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ యజమానులు అనుమతి లేని లే అవుట్ లలో ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకొనుటకు ప్రభుత్వం ఈనెల 31 వరకు 10 శాతం ప్లాట్ రిజిస్ట్రేషన్ అయి మిగతా కానీ వాటిని కూడా సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ తో పాటు ఎల్ఆర్ఎస్ రుసుము కూడా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు ఈనెల 31 లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే వారికి 25 శాతం రాయితీ ప్రకటించింది పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వీరేందర్ ప్రకటనలో తెలిపారు.

# డిగ్రీ కళాశాలలో మహిళా ఉద్యోగులకు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి)మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా ఉద్యోగులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులైనా డాక్టర్ ఈ మాధవి డాక్టర్ టి రజిత కే రమ్య కరీంబి భాగ్యలక్ష్మి టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని శాలువలతో సత్కరించి ఘనంగా సమానం చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జన్ను

విజయకుమార్ మాట్లాడుతూ క్లారా జట్కిన్ లాంటి కమ్యూనిస్టు నాయకురాలువారి కృషి ఫలితంగా సమాన వేతనం కోసం ఉద్యమించగా రష్యాలో చక్రవర్తి పదవి కోల్పోవడం జరిగిందని అన్నారు దానిలో భాగంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1975 నుండి జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు స్త్రీ ఒక తల్లిగా చెల్లిగా భార్యగా బంధువుగా మంచి పాత్రను పోషిస్తూ కుటుంబం చెక్కబెడుతుందని అన్నారు భారత దేశంలో సావిత్రిబాయి పూలే రమాబాయి లాంటి వారి కృషి ఫలితంగా స్త్రీలకు విద్య అంబేద్కర్ రాజ్యాంగ రచన చేయగలిగారు సమాజంలో మార్పు కొరకు కుటుంబ వ్యవస్థనుండి స్త్రీ పురుషుల సమానత్వాన్ని పిల్లలకు నేర్పించాలని కోరారు కార్యేషు దాసి కరణేషు మంత్రి భోచేషు మాత శనేశ్వరమ్మ అనే స్త్రీ పాత్రను గొప్పగా వర్ణించడమే కాకుండా ప్రస్తుత సమాజంలో కొనసాగుతున్న అత్యాచారాలపై పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# హెచ్ఎం మాధవి కి ఉత్తమ సేవా గుర్తింపు అవార్డు



చిట్యాల మార్చి 07 (వుదయం ప్రతినిధి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిష్టాత్మక ఉమెన్ ఇన్స్పైరింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు ను చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోగికార్ మాధవి అందుకున్నారు

ఈ సందర్భంగా హైదరాబాద్ లోని భాస్కర ఆడిటోరియంలోనీ పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం లో విద్యారంగంలో అందించిన సేవలకు హెచ్ఎం మాధవికిప్రముఖ సినీ నటులు సుమన్, దివ్యవాణి ల చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల కాలంగా పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి జీవితంలో అనేకమంది విద్యార్థినీ , విద్యార్థులను ఉత్తమ శ్రేణి విద్యార్థులుగా, ఉత్తమ బావి పౌరులుగా తీర్చిదిద్దేందుకు నా వంతుగా తీవ్రంగా కృషి చేస్తున్నానని తెలిపారు. నా కృషిని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేసిన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ అద్దంకి రాజా,మాజీ మంత్రి వేణుగోపాచారి కి, వుడమి సాహితీ వేదిక అధ్యక్షులు బాల్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

# గుప్త నిధులు తవ్వుటకు ప్రయత్నిస్తున్న వారిపై కేసు నమోదు


జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి)గుప్తనిధులు తవ్వుటకు ప్రయత్నిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు మహాదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహదేవపూర్ మండలం ఎనకపల్లి గ్రామ శివారులో కొంతమంది అనుమానితులు కొన్ని పరికరాలతో గుప్త నిధుల కోసం తవ్వుటకే ప్రయత్నిస్తున్నారని పోలీసులకు గ్రామస్తుల ద్వారా సమాచారం అందగా వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోని అక్కడ ఉన్న ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు అదుపులోకి తీసుకున్న వారిలో 1అదిలాబాద్ టౌన్ ఇంజాపూర్ వెంకటరమణ,ప్రసాద్ 2. జనగాం జిల్లా, చిల్పూర్ మండల్, శ్రీపతిపల్లి కి చెందిన పల్లపు నరసింహ,3.చౌదర్పల్లి భువనగిరి జిల్లా కు చెందిన షేక్ షరీఫ్ ఉద్దీన్,4. చందుర్తి,మండల్, రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన ఎండీ రియాజ్,5. వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన పిల్లి అశోక్ కుమార్,అను వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారితో పాటు డిజిటల్ మెటల్ డిటెక్టర్ పరికరాలు, తవ్వుటకు ఉపయోగించే పరికరాలు,20 నిమ్మకాయలు మరియు పసుపు రంగు నీళ్ల తో.వాళ్లందరూ అక్కడికి ఒక చాకోలెట్ కలర్ ఫోర్డ్ ఫిగో కంపెనీకి చెందిన బి.నెంబర్ టి ఎస్ 23సి 4743 కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారికి ఎన్కపల్లి గ్రామానికి చెందిన సమ్మయ్య అను వ్యక్తి అక్కడ గుప్త నిధులు గురించి తెలుపగా, ఈ ఐదుగురు తవ్వకాల్ని ప్రారంభించారని. సమ్మయ్య అను వ్యక్తి పరారీలో ఉన్నాడని వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురితోపాటు వారి వద్ద ఉన్న పరికరాలు కారును పోలీస్ స్టేషన్ కు తీసుకొని వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.

# నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి: సిపిఎం నాయకులు




చిట్యాల మార్చ్ 07(వుదయం ప్రతినిధి)బీ చిట్యాల మండలం చిన్న కాపర్తి,వెలిమినేడు గ్రామల లో నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్,అరూరీ శ్రీను డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని చిన్న కాపర్తి గ్రామంలో శుక్రవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పై జరిపిన సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు.నిరుపేద కుటుంబాల వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం గతంలో సర్వే నెంబర్ 711,717 లో యందు పదహారు ఎకరాల భూమిని కొనుగోలు చేసినా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇట్టి స్థలంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవనం, పల్లె ప్రకృతి వనం కోసం కొంత స్థలం ఇవ్వటమే కాకుండా క్రీడా స్థలం ఇచ్చారని తెలిపారు.అదే విధంగా 14 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని తెలిపారు.ఇళ్ళ స్థలాల పట్టాల స్థలాల కోసం సిపిఎం ఆందోళన, పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసి ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కోనేటి రాములు, గ్రామ శాఖ కార్యదర్శి వీరమళ్ళ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు రూపని ఇద్దయ్య, శిరస్సు హన్మయ్య,నందిపాటి సైదులు,రుద్రారపు బిక్షం,నేలికంటి నరసింహ,పంది నరేష్,నాతి వెంకటరామయ్య,అరూరి దుర్గయ్య,మామిడి గణేష్, బొడ్డు నర్సింహ,వీరమళ్ళ శంకరయ్య,రుద్రారపు పార్వతమ్మ, హెచ్చు మారెమ్మ,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సర్టిఫికెట్ల పరిశీలన



చిట్యాల మార్చ్ 07(వుదయం ప్రతినిధి)బీ చిట్యాల ఎంపీడీవో కార్యాలయం లో శుక్రవారం నాడు వికలాంగుల 2024-25 సం గాను వికలాంగులు కార్పొరేషన్ నుండి ఆన్లైన్ లబ్ధిదారుల నిర్వహణ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 58 వికలాంగులు పాల్గొన్నారు. సర్టిఫికెట్ల ను ఎంపీడీవో ఎస్ పి జయలక్ష్మి పరిశీలన చేయడం జరిగింది.చిట్యాల మండలంకు వికలాంగులకు ఒక యూనిట్ రావడం జరిగింది యూనిట్ విలువ 50వేల దానికిగాను దరఖాస్తు చేసుకున్న వికలాంగుల సర్టిఫికెట్లు పరిశీలన చేయడం జరిగింది అర్హతలను బట్టి లబ్ధిదారులను సెలెక్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరెండెంట్ మనోహర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత, గుండ్రంపల్లి పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్



## ఫ్లిప్‌కార్ట్‌లో బిగ్ సేవింగ్ డేస్ సేల్.. ఈ మొబైల్‌లపై భారీ డిస్కౌంట్లు!




ఈ సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్లపై అద్భుతమైన ఆఫర్లను అందిస్తోంది. ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16, ఐఫోన్ 13, ఐఫోన్16ఈ, శాంసంగ్ గెలాక్సీ ఎస్24 వంటి ప్రముఖ బ్రాండ్ స్మార్ట్ ఫోన్‌లపై అదిరిపోయే డిస్కౌంట్లను అందిస్తోంది. వినియోగదారులను మరింతగా ఆకట్టుకునేందుకు ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు రకరకాల ఆఫర్లను అందిస్తుంటాయి. ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ బిగ్ సేవింగ్ డేస్ సేల్ ప్రారంభించింది. ఈ రోజు (మార్చి 7) నుంచి ప్రారంభమైనీ సేల్ 13వ తేదీ వరకు అందుబాటులో ఉండనుంది. ఈ సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్లపై అద్భుతమైన ఆఫర్లను అందిస్తోంది. ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16, ఐఫోన్ 13, ఐఫోన్16ఈ, శాంసంగ్ గెలాక్సీ ఎస్24 వంటి ప్రముఖ బ్రాండ్ స్మార్ట్ ఫోన్‌లపై అదిరిపోయే డిస్కౌంట్లను అందిస్తోంది.

ఈ సేల్ నుండి ఫోన్ కొనడం ద్వారా చాలా డబ్బు ఆదా చేసుకోవచ్చు. ఈ సేల్‌లో ఐఫోన్ 16ను రూ.59,999కే కొనుగోలు చేయవచ్చు. అయితే ఈ ఫోన్ అసలు ధర రూ.79,900తో కంపెనీ విడుదల చేయగా, ఆఫర్‌లో భాగంగా భారీ డిస్కౌంట్‌తో పొందవచ్చు. ఈ మొబైల్ ధర రూ.68,999గా ఉంది. ఇక ఫ్లిప్‌కార్ట్ సేల్‌లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారా రూ.4వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.5,000 రాయితీ పొందే అవకాశం ఉంటుంది. ఇలా మొత్తం కలుపుకొని ఐఫోన్ 16 ని రూ.59,999కే పొందవచ్చు. అలానే ఐఫోన్ 16 ప్లస్‌ని రూ.69,999కి, ఐఫోన్ 16 ప్రోని రూ.1,03,900కి విక్రయిస్తోంది. ఇక ఐఫోన్ 16ఈ రూ.55,900, ఐఫోన్ 15 రూ.58,999, ఐఫోన్13 రూ.40,999 కే కొనుగోలు చేయవచ్చు. ఇక శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌పై ఫ్లిప్‌కార్ట్ భారీ తగ్గింపుతో పొందవచ్చు. గెలాక్సీ ఎస్24 రూ.52,999, గెలాక్సీ ఎస్24 ప్లస్‌ని రూ.54,999కే కొనుగోలు చేయవచ్చు. అలాగే శాంసంగ్ గెలాక్సీ ఎస్25 రూ.73,999కే లభిస్తుంది. తాజాగా మార్కెట్లోకి తీసుకొచ్చిన శాంసంగ్ ఫోల్డబుల్ ఫోన్‌పై కూడా డిస్కౌంట్‌ను ప్రకటించింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 లాంచ్ ధర రూ.1,64,999 కాగా సేల్‌లో రూ.1,49,999కే పొందవచ్చు. అలాగే నథింగ్ ఫోన్లలోనూ డిస్కౌంట్లు ప్రకటించింది. నథింగ్ 2ఏ రూ.19,999,

నథింగ్ 2ఏ ప్లస్ రూ.25,499కి పొందవచ్చు. ఇవే కాకుండా పలు రకాల బ్రాండ్ స్మార్ట్ ఫోన్‌లపై కూడా భారీ డిస్కౌంట్‌తో అందిస్తోంది.




## తల్లిదండ్రులకు బహుమతి ఇస్తే పన్ను చెల్లించాలా?

ఆదాయపు పన్నులో రకరకాల నియమాలు ఉంటాయి. ఒక వ్యక్తి తన సంపాదనపై ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొన్నింటిపై ట్యాక్స్ మినహాయింపు ఉంటుంది. మరి తల్లిదండ్రులకు ఏదైనా గిఫ్ట్ రూపంలో ఇస్తే ట్యాక్స్ చెల్లించాలా? భారతీయ సంస్కృతిలో బంధువులకు, స్నేహితులకు బహుమతులు ఇచ్చే సంప్రదాయం ఉంది. మీరు ఎవరి ఇంటికి వెళ్ళినా, ఖచ్చితంగా మీతో ఒక బహుమతి తీసుకెళ్తారు. పెళ్లిళ్లు, పుట్టినరోజులు కాకుండా ఇతర సందర్భాలలో బహుమతులు ఇస్తారు. కానీ ఆదాయపు పన్ను చట్టంలో కొన్ని షరతులు ఉన్నాయని మీకు తెలుసా? దీని కారణంగా పన్ను చెల్లింపుదారుడు అందుకున్న బహుమతులపై పన్ను మినహాయింపు పొందుతారు. బహుమతులపై ఆదాయపు పన్ను ఏ ఒక్క బహుమతిపైనా విధించదని, కానీ ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న మొత్తం బహుమతులపై విధిస్తారు. దీనికి సంబంధించి చాలా మంది మనసుల్లో అనేక రకాల ప్రశ్నలు తలెత్తుతాయి. ఉదాహరణకు.. నేను నా తల్లిదండ్రులకు బహుమతి ఇస్తే, నేను పన్ను చెల్లించాలా? భారతీయ ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం.. ఒక వ్యక్తి తన తల్లిదండ్రులకు బహుమతి ఇస్తే సాధారణంగా ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, బహుమతిపై పన్ను విధించబడాలా వద్దా అని నిర్ణయించడానికి కొన్ని షరతులు, నియమాలు ఉన్నాయి. మీరు మీ తల్లిదండ్రులకు నగదు బహుమతిగా ఇస్తే, గరిష్ట పరిమితి లేదు. అది పూర్తిగా పన్ను రహితమైనది. మీరు మీ తల్లిదండ్రులకు ఏదైనా ఆస్తిని బహుమతిగా ఇస్తే అది కూడా పన్ను రహితంగా ఉంటుంది. కానీ గిఫ్ట్ డీడ్ చేయడం తప్పనిసరి. బంగారం, షేర్లు, ఆభరణాలు మొదలైన వాటికి పన్ను ఉచితం కాబట్టి మీరు వాటిని బహుమతిగా ఇవ్వవచ్చు.


## గోల్డ్ లోన్ అంత ఈజీ కాదు బాసూ.. ఇకపై ఆర్బీఐ కఠిన నిబంధనలు.!



బంగారం అంటే కేవలం అలంకార ప్రియం మాత్రమే కాదు, ఆర్థికంగా ఆదుకునే భరోసా కూడా. సామాన్యుల నమ్మకం ఇదే. కష్టం వస్తే గోల్డ్ లోన్‌తో గట్టెక్క వచ్చు అనుకునే వాళ్లకు గడ్డు కాలం రాబోతుంది. భద్రం అని బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెడితే..బ్యాంకు సిబ్బంది చేతివాటంతో అసలుకే ఎసరు వస్తోంది. బంగారం అంటే కేవలం అలంకార ప్రియం మాత్రమే కాదు, ఆర్థికంగా ఆదుకునే భరోసా కూడా. సామాన్యుల నమ్మకం ఇదే. కష్టం వస్తే గోల్డ్ లోన్‌తో గట్టెక్క వచ్చు అనుకునే వాళ్లకు గడ్డు కాలం రాబోతుంది. భద్రం అని బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెడితే..బ్యాంకు సిబ్బంది చేతివాటంతో అసలుకే ఎసరు వస్తోంది. కస్టమర్లు తాకట్టు పెట్టిన బంగారాన్ని దారి మళ్లిస్తూ మోసాలకు పాల్పడిన బ్యాంకు సిబ్బంది వైనాలు ఇటీవల సంచలనం రేపాయి. మరోవైపు దేశవ్యాప్తంగా గోల్డ్ లోన్స్ అడ్డగోలుగా పెరుగుతోన్న క్రమంలో వీటన్నింటికీ కళ్లెం వేసేందుకు నిబంధనలను మరింత కఠినతరం చేసే దిశగా ఆర్‌బిఐ చర్యలు చేపట్టబోతుంది. ఏ బ్యాంక్‌కు వెళ్లినా..ఏ ఫైనాన్షియల్ ఆఫీస్‌కు వెళ్లినా గంటలో అరగంటలో గోల్డ్‌లోన్ ఇవ్వబడును అని తాటికాయంత అక్షరాలతో ఆకర్షణీయపై ప్రకటనలు కన్పిస్తాయి. లోన్ మంజూరు కావాలంటే అప్రయిజర్లే కింగ్ మేకర్లు. బంగారాన్ని పరీక్షించి.. తూకం వేసి ఎంత రుణం ఇవ్వాలో నిర్ణయిస్తారు. అక్కడే మోసాలకు తెరలేస్తోంది. పైకం కొద్దీ లోన్ మంజరు చేయడం..కొన్ని సార్లు గిల్టు నగలను తాకట్టు పెట్టి బ్యాంక్‌లను బురిడీ కొట్టించడం వంటి మోసాలు కొకొల్లుగా జరిగాయి. జరుగుతున్నాయి. ఇట్టాంటి వాటిని కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ కొరడా ఝులిపించబోతుంది. లోన్ తీసుకునేది ఎవరు? తాకట్టు పెట్టే బంగారం వారిదేనా? అని ఆరా తీయడం సహా అందుకు సంబంధించిన ఆధారాలను విధిగా సమర్పించాలనే నిబంధన తీసుకురాబోతుంది ఆర్‌బీఐ. గోల్డ్ లోన్ జారీ చేయాలంటే తాకట్టు బంగారం తమదేనని వినియోగదారులు కంపల్సరీగా ఆధారాలు ఇవ్వాలి. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ సహా కస్టమర్ల బ్యాంక్ గ్రౌండ్‌ను వెరీఫై చేసుకున్నాకే రుణాలు ఇవ్వాలని బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేయబోతుందని తెలుస్తోంది. ఇక నుంచి ఇలా బంగారం తాకట్టు పెట్టగానే అలా రుణం జారీ చేయడం ఉండదు. ఎవరు? ఏ అవసరం కోసం లోన్ తీసుకుంటున్నారు? తాకట్టు పెట్టే బంగారం వారిదేనా? ఇలాంటి వివరాలన్నింటిని విధిగా తీసుకోవడం సహా ఏ పర్పస్ కోసం లోన్ తీసుకుంటున్నారో..అందుకోసమే నగదు వాడుతున్నారా?లేదా ?అని చెక్ చేసేలా విధివిధానాలు రాబోతున్నాయి. గోల్డ్ లోన్ తీసుకునే వారికి 20వేలకు మించి నగదు చేతికి ఇవ్వవద్దని , 20వేలకు మించి బ్యాంక్ అకౌంట్ ద్వారా ట్రాన్సాక్షన్ జరగాలని ఇప్పటికే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ..%చీదీఖీజ%లను ఆదేశించింది ఆర్‌బీఐ. గోల్డ్ లోన్ మంజూరు చేసే క్రమంలో బంగారం విలువ నిర్ధరణతో పాటు ప్రాసెసింగ్ రుసుములు, వడ్డీ విషయంలో వేర్వేరు పద్ధతులను ఆర్థిక సంస్థలు అనుసరిస్తున్నట్లు ఆర్‌బీఐ దృష్టికొచ్చింది. ఒకే పాన్‌కార్డుపై ఒకే ఏడాది అనేకమార్లు గోల్డ్ లోన్ చేయడం, డిఫాల్టర్లకు సమాచారం ఇవ్వకుండానే వారు తాకట్టు పెట్టిన బంగారాన్ని వేలం వేయడం వంటి అంశాలను ఆర్‌బీఐ తీవ్రంగా పరిగణించింది. వీటన్నింటిపై సెవన్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. 16 నెలల పాటు సదరు కమిటీ గోల్డ్ రుణాల్లో జరుగుతున్న అవకతవకలను క్షుణ్ణంగా పరిశీలించింది. కమిటీ నివేదిక ఆధారంగా గోల్డ్ లోన్స్‌పై స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని నిర్ణయించింది ఆర్‌బీఐ.

## కృత్రిమ మేధ

### ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం




న్యూఢిల్లీ: ఇండియాఏఐ మిషన్ తొలి వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, డేటా సెట్ ప్లాట్‌ఫామ్ 'ఏఐకోష'తో పాటు దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్: ఈ వేదిక ద్వారా 18,000కు పైగా జీపీయూ (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లతోపాటు క్లౌడ్ స్టోరేజ్, ఇతర ఏఐ సేవలను వినియోగించుకోవచ్చు. విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖలు అందుబాటు ధరలో కంప్యూటింగ్ వనరులను ఉపయోగించుకోవడంతోపాటు దేశంలో ఏఐ మోడల్ ట్రైనింగ్, డెవల్‌పమెంట్‌ను వేగవంతం చేసేందుకు కేంద్రం ఈ మౌలిక వసతిని ప్రారంభించింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే అత్యంత చౌకగా గంటకు రూ.67కే జీపీయూల వినియోగ సేవలను ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. భారత చంద్రయాన్ మిషన్ తరహాలో చాలా తక్కువ ఖర్చుతో భారత్ సొంత ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోనుందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అంతేకాదు, 3-4 ఏళ్లలో మేడ్ ఇన్ ఇండియా జీపీయూలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది సమగ్ర డేటాసెట్ ప్లాట్‌ఫామ్. అత్యంత నాణ్యమైన వ్యక్తిగతేతర డేటా సెట్ల వినియోగాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ వేదిక దేశీయ అవసరాలకు అనుగుణమైన ఏఐ మోడళ్ల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు డెవలపర్లకు వనరులు, టూల్స్, నిపుణుల మార్గదర్శకత్వ సేవలను అందించనుంది. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశంలో ఏఐ ఆవిష్కరణలకు ఊతమివ్వడంతో పాటు సొంత ఏఐ ఆవరణ వ్యవస్థను అభివృద్ధి చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.10,371 కోట్ల బడ్జెట్‌తో ఇండియాఏఐ మిషన్‌ను ప్రారంభించింది. గత ఏడాది మార్చిలో కేంద్ర కేబినెట్ దీని ఆమోదం తెలిపింది.

## 74,000 పైకి సెన్సెక్స్ రూ.4.54 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 609.86 పాయింట్లు బలపడి 74,340.09 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 207.40 పాయింట్ల వృద్ధితో 22,544.70 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కె ట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫల విషయంలో కాస్త మెత్తబడటం మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎసఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.54 లక్షల కోట్ల మేర పెరిగి రూ.397.58 లక్షల కోట్లకు చేరుకుంది. నయారా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్) తన మైనారిటీ షేర్‌హోల్డర్ల నుంచి 2.59 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ రూ.731 చొప్పున తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు తెలిపింది. ఐఐఎఫఎల్ క్యాపిటల్ సర్వీసెస్ అనుబంధ విభాగమైన ఐఐఎఫఎల్ ఫెసిలిటీస్ సర్వీసెస..ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన అవంతి ఫీడ్స్‌లో మరో 4.4 శాతం వాటాను రూ.470 కోట్లకు దక్కించుకుంది. ఈ మంగళవారం కూడా ఐఐఎఫఎల్ సర్వీసెస్ అవంతీ ఫీడ్స్‌లో 4.4 శాతం వాటాను రూ.435 కోట్లకు కొనుగోలు చేసింది.

## జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులకు ఎసరు




న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండిస్టీస్ లిమిటెడ్‌కు చెందిన వయాకామ్ 18, వాల్ట్ డిస్నీ ఇండియా యూనిట్ల మధ్య కొత్తగా ఏర్పడిన సంయుక్త భాగస్వామ్య సంస్థ జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారని తెలుస్తోంది. నెల రోజుల కిందటే తొలగింపుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఉద్వాసనలు ఇప్పట్లో ముగియవని.. జూన్ వరకు కొనసాగుతాయని సంబంధిత అధికారి ఒక్కరు పేర్కొన్నట్లు జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్స్, కమర్షియల్, లీగల్ విభాగాల్లో తొలగింపులు ఉంటున్నాయి. వేటు పడిన వారిలో ఎంట్రీ లెవల్ ఉద్యోగులు, సీనియర్ మేనేజర్లు, సీనియర్ డైరెక్టర్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారు. వయాకామ్ 18, డిస్నీ స్టార్ ఇండియా విలీనాన్ని దేశంలోనే అతిపెద్ద మీడియా సంస్థ సృష్టిగా ఆ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. రెండు పెద్ద కంపెనీలు ఏకమైనప్పుడు సిబ్బందిపై వేటు ఉంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఛాంపియన్స్ ట్రోఫీ, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) వంటి వాటిల్లో పని చేస్తోన్న ఉద్యోగులపై ప్రభావం ఉండదని సమాచారం. 2025లో భారీ లాభాలను ఆర్జించాలని జియోస్టార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే సిబ్బందికి ఎసరు పెడుతోంది. ఉద్యోగం కోల్పోయిన వారికి వారి పదవీకాలాన్ని బట్టి 6 నుంచి 12 నెలల జీతంతో సహా ఇతర ప్యాకేజీలను అందించనున్నట్లు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులకు ఒకటి నుంచి మూడు నెలల వరకు నోటీస్ పీరియడ్‌తో పాటు కంపెనీలో పూర్తయిన ప్రతి ఏడాదికి ఒక నెల పూర్తి వేతనం లభిస్తుంది. 2024 నవంబర్‌లో రిలయన్స్‌కు చెందిన వయాకామ్18, స్టార్ ఇండియా మధ్య జాయింట్ వెంచర్‌గా జియో స్టార్ ఏర్పడింది. ఐపిఎల్ 2025 కోసం జియోస్టార్ రికార్డు స్థాయిలో రూ.5,000 కోట్ల ప్రకటనల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# జాతీయం - అంతర్జాతీయం

## సుప్రీంకోర్టులో ఉదయనిధికి ఊరట



సనాతన ధర్మం విషయంలో చేసిన వ్యాఖ్యలపై తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కు సుప్రీంకోర్టులో కొద్దిగా ఊరట లభించింది. ఈ వ్యాఖ్యలపై కొత్తగా కేసులు దాఖలు చేయడాన్ని అత్యున్నత ధర్మాసనం నిషేధించింది. కోర్టు అనుమతిస్తే తప్ప కొత్తగా ఈ అంశంలో కేసులు నమోదు చేయరాదని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. ఉదయనిధి స్టాలిన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఉదయనిధి స్టాలిన్ 2024 సెప్టెంబర్ లో సనాతన ధర్మ కూడా డెంగ్యూ, మలేరియా వంటి ఓ రోగమే అని దానిని నిర్మూలించాలని చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.

దేశవ్యాప్తంగా సాంప్రదాయవాదులు , పలు ధార్మిక సంస్థలు ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కొడుకు అయిన ఉదయనిధి స్టాలిన్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తాను ఏ మతాన్ని కించపరచ లేదని, కుల ఆధారిత వివక్షను, సామాజిక అన్యాయాలనే విమర్శిస్తున్నానని వాదించారు. ఉదయనిధి తరుపున సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ హాజరై, వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఈ అంశంలో పలు ఎఫ్ ఐ ఆర్ లు నమోదు కాగా, తాజాగా బీహార్ కొత్తగా కేసు నమోదయినట్లు కోర్టుకు విన్నవించారు. దీంతో ఈ అంశంపై కొత్త కేసులు నమోదు చేయడానికి వీలు లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులు అన్నింటినీ తమిళనాడుకు కాకపోతే, కర్ణాటకకు బదిలీ చేసేవిషయం పరిశీలించనున్నట్లు కోర్టు వెల్లడించింది.

ఉదయనిధి స్టాలిన్ పై మరిన్ని కొత్త కేసులు దాఖలు కాకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ , కేసు తదుపరి విచారణను 2025 ఏప్రిల్ 28వ తేదీకి వాయిదా వేసింది.

## బహిష్కరణ భయాలు! 1.34లక్షల మంది హెచ్4

వాషింగ్టన్: అమెరికాలోని వలసదారు ల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వరుస నిర్ణయాలు భయకంపితులను చేస్తున్నా యి. ఓ దశలో వారికి కంటిమీద కునుకులేకుం డా పోతోంది. ఇప్పటి వరకు అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా ప్రభు త్వం వీసా గడువు ముగిసిన వారిపైనా బహిష్కరణ చర్యలుంటాయని హెచ్చరికలు పంపుతోంది. ఈ నేపథ్యం లో హెచ్1బి వీసా దారుల పిల్లలు అంటే డిపెండెంట్ వీసా కింద అమెరికా వచ్చిన హెచ్4 వీసా దారులను కలవరపాటుకు గురిచేస్తోంది. ము ఖ్యంగా 21 ఏళ్ల వయస్సుకు చేరుకున్న వారిని ఇది మరింత ఆందోళనకు గురిచేస్తోంది. తమ భవిష్యత్ విషయంలో అనిశ్చిత పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అమెరికాలో ప్రస్తుత ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం వారికి హెచ్ 1బి వీసా పొందిన తల్లిదండ్రుల కింద ఆధారపడిన డిపెండెంట్ హోదా వర్తించదు. వయస్సు పెరిగిన తర్వాత వారు మరో వీసాకు మారడానికి రెండేళ్ల వ్యవధి ఉండేది


. కానీ, వలస విధానంలో ఈ మధ్యవచ్చిన మార్పుల వల్ల వారి భవిష్యత్ అయోమయంలో పడింది. మార్చి 2023 నాటికి, దాదాపు 1.34 లక్షల మంది భారతీయ పిల్లలు 21 సంవత్సరాలు దాటినట్లు అంచనా. చాలా మంది ఇప్పుడు ఆ గండం నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తున్నారు. కొందరు స్టూడెంట్ వీసా సంపాదించి అమెరికాలోనే ఏదో యూనివర్సిటీలో చేరే ఆలోచన చేస్తుంటే, మరి కొందరు కెనడా లేదా బ్రిటన్ వంటి దేశాలకు వలసపోయి అక్కడ చదువు సాగించే ఆలోచన చేస్తున్నారు. అమెరికాతో పోల్చి చూస్తే ఆ దేశాలలో కాస్త సరళమైన విధానాలు ఉన్నాయి. ఇక అమెరికాలో ఉపాధి పొందేందుకు గ్రీన్ కార్డు వ్యవస్థ వీలు కల్పిస్తున్నా. ఇప్పటికే చాలామంది గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా, చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం భారతీయ వలసదారుల ఆవేదనకు కారణమవుతోంది. అమెరికా పౌరసత్వం, ఇమిగ్రేషన్ సర్వీసెస్ 2026 ఆర్థిక సంవత్సరంలో హెచ్-1బి వీసాల రిజిస్ట్రేషన్ వ్యవధి ప్రకటించింది.




## ప్రపంచ అత్యంత వృద్ధ క్షురకురాలికి గిన్నీస్ పురస్కారం

ఆమె ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళా క్షురకురాలు. ఆమె వయసు 108 సంవత్సరాలు. బక్కపలచని, తెల్లటి నెరసిన జుట్టు ఉన్న ఆ జపనీస్ మహిళకు తన పని నుంచి విరమించాలన్న ఆలోచనే లేదు. ఈ వారం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ద్వారా అధికారిక గుర్తింపు లభించడం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చిందని షిట్సుయ్ హకోయిషి తెలిపింది. ఆమె కస్టమర్లు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆమెకు బుధవారం అంతర్జాతీయ ఫ్రాంచైజీ నుండి అధికారిక సర్టిఫికేట్ అందజేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో పురుష క్షురకులకు ప్రత్యేక కేటగిరీ ఉంది. అయితే 2018లో 107 సంవత్సరాల వయసులో సర్టిఫికేట్ పొందిన అమెరికాకు చెందిన ఆంథోనీ మాన్సినెల్లి మరణించడంతో, హకోయిషి ఈ రికార్డుకు ఏకైక హోల్డర్‌గా మిగిలిపోయింది. షిట్సుయ్ హకోయిషి తొమ్మిది దశాబ్దాలుగా క్షురకురాలిగా పనిచేస్తోంది.'నా కస్టమర్ల చలువ వల్లే నేను ఇన్నాళ్లు ఇంత దూరం రాగలిగాను' అని ఆమె అన్నది. నకగావాలో రైతు కుటుంబంలో 1916 నవంబర్ 10న ఆమె జన్మించింది. తన 20 ఏళ్లకే ఆమె క్షురకురాలిగా తన లైసెన్సు పొందింది. ఆమె భర్త 1937లో జపాన్‌చైనా యుద్ధంలో చనిపోయాడు. వారికి ఇద్దరు పిల్లలు. అమెరికా 1945 మార్చి 10న టోక్యోపై వేసిన బాంబులో ఆమె సెలూన్ కూడా ధ్వంసం అయిపోయింది. దాంతో ఆమె, ఆమె పిల్లలు ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టారు. 'ఈ ఏడాది నాకు 109 ఏళ్లు, నేను 110 వచ్చే వరకు బతికే ఉంటాను' అని ఆమె నవ్వుతూ ఆత్మవిశ్వాసంతో చెప్పింది.

## నటి రన్యారావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో మరో మలుపు



దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యారావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. తాజాగా ఇది మరో మలుపు తిరిగింది. నటి బంగారం స్మగ్లింగ్ వెనుక ఓ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్టు కథనాలు బయటికొచ్చాయి. దీంతో ఈ కేసు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. రన్యారావు నివాసంలో పోలీసులు సోదా చేసి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు ఓ రాజకీయ నాయకుడి తరఫున బెంగళూరు లోని ఓ జువెల్లరీ బొటిక్ నుంచి కొనుగోలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఈ నగల ధరను ఎవరు చెల్లించారు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసులో నటికి ఉన్న రాజకీయ పరిచయాలతో సంబంధం లేకుండా చట్టం తన పని తాను చేస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి న్యాయ సలహాదారు ఏఎస్ పొన్నన్న వ్యాఖ్యానించారు. ఇందులో అధికారుల, రాజకీయ నాయకుల జోక్యం ఉంటే దర్యాప్తులో బయటపడుతుందన్నారు.' రన్యారావు స్మగ్లింగ్ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగు లోకి వచ్చాయి. గత ఏడాదిలో ఆమె దాదాపు 30 సార్లు దుబాయ్‌కి వెళ్లొచ్చినట్టు తెలుస్తోంది. కిలో బంగారం స్మగ్లింగ్ చేసినందుకు గాను ఆమె రూ. లక్ష చొప్పున వసూలు చేసినట్టు సమాచారం. అంటే ప్రతిట్రిప్‌నకు రూ.1213 లక్షలు తీసుకునేదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## బెదిరింపులకు భయపడేది లేదు



బీజింగ్ : బెదిరింపులకు భయపడబోమని, అయినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు, ఇతర సవాళ్లను ఎదుర్కొనగలిగే సామర్థ్యం తమ ఆర్థిక వ్యవస్థకు వుందని చైనా వాణిజ్య శాఖ మంత్రి వాంగ్ వెంటావో స్పష్టం చేశారు. వాణిజ్య యుద్ధంలో విజేతలు అంటూ ఎవరూ వుండరని వ్యాఖ్యానించారు. చైనా నేషనల్ కాంగ్రెస్ వార్షిక సమావేశం సందర్భంగా వాంగ్ మాట్లాడుతూ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా వుందని పునరుద్ఘాటించారు. బెదిరింపులు, బలవంతపు చర్యలు అంతిమంగా విఫలమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చైనాపై ఇలాంటివి పనిచేయవని అన్నారు. తమను భయపెట్టలేరన్నారు. దేశ ప్రయోజనాలు కాపాడుకోవాలన్న చైనా కృతనిశ్చయం తిరుగులేనిదన్నారు. 140 దేశాలకు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా చైనా వుందంటే తమకు అనేక అవకాశాలు వున్నాయని అర్థమని అన్నారు. తమ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక మార్కెట్ల నిర్మాణానికి, బలోపేతానికి అనుసరించే వ్యూహాల గురించి ఆయన వివరించారు. జనవరి నుండి రెండుసార్లు చైనాపై ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లు పెంచింది. చైనా కూడా ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై, కంపెనీలపై ఇలాంటి ఆంక్షలు విధించింది. ఇతర దేశాలతో వ్యవహారాల్లో పరస్పర గౌరవం వుండాలని చైనా ఆకాంక్షిస్తుందన్నారు., అమెరికా ఈ తప్పుడు దారిలోనే ముందుకు సాగితే తాము కూడా అదే రీతిన ప్రతిస్పందిస్తామని, చివరికంటా పోరాడతామని చెప్పారు. వాణిజ్యంపై విభేదాలుంటే పరిష్కరించుకోవడానికి చైనా సిద్ధంగా వుందన్నారు. సాధ్యమైనంత త్వరలో సముచితమైన సమయంలో ఉభయ పక్షాలు సమావేశమై సమాచార మార్పిడి చేసుకోవాలన్నారు.

## జెలెన్‌స్కీ స్వస్థలంపై రష్యా క్షిపణి దాడి

కీవ్ : రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో జెలెన్‌స్కీ స్వస్థలంపై క్షిపణి దాడి జరిగింది. రాత్రి సమయంలో క్రీవి రీహ్‌లోని ఓ హోటల్‌పై రష్యా క్షిపణి దాడిలో నలుగురు మృతి చెందారు. ఆ హోటల్‌లో తమ దేశ పౌరులతోపాటు అమెరికా, బ్రిటన్ జాతీయులు ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వెల్లడించారు. ఈ సంఘటనలో సుమారు 30 మంది గాయపడగా, పలువురి పరిస్థితి విషమంగా ఉంది. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ట్రంప్ అధికారం లోకి వచ్చిన తరువాత నుంచి ఆ దేశం పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల వ్యవధి లోనే మిలిటరీ, ఇంటెలిజెన్స్ సాయాన్ని నిలిపివేశారు. ఈ నేపథ్యం లోనే తాజాగా ఈ సంఘటన జరిగింది. ఈ క్రీవిరీహ్ లోనే జెలెన్‌స్కీ జన్మించారు. వైట్‌హౌస్‌లో ఇటీవల యూఎస్, ఉక్రెయిన్ అధ్యక్షుల మధ్య జరిగిన చర్చ కాస్తా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. దాని తర్వాత మరోసారి అమెరికాతో తాము చర్చలకు సిద్ధమేనని జెలెన్‌స్కీ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి యూఎస్ పర్యటనలో ఆయనతోపాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా మేక్రాన్ ఆలోచన చేస్తున్నట్టు ఫ్రాన్స్ ప్రభుత్వం వెల్లడించింది. వీరంతా వెళ్లడం ద్వారా ఐరోపా ఐక్యత చాటుకోవాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

## హిందూత్వ ప్రతిఘటనకు కోటగా కేరళ




న్యూఢిల్లీ : కార్పొరేట్, హిందూత్వ బంధానికి వ్యతిరేకంగా దేశంలో జరుగుతున్న ప్రతిఘటనకు కోటగా కేరళ నిలిచిందని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ అన్నారు. దేశంలో నియో ఫాసిస్ట్ ధోరణులను, నయా ఉదారవాద విధానాలను అడ్డుకునేందుకు పోరాటాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. కేరళలోని కొల్లంలో గురువారం పార్టీ కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. కొడియేరి బాలకృష్ణన్ నగర్‌లో జరుగుతున్న ఈ మహాసభలో 500 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎకె బాలన్ ఎర్రజెండాను ఎగురవేశారు. మతోన్మాద, పెట్టుబడిదారీ దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో మూడు రోజుల పాటు ఈ మహాసభ జరగనుంది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బృందాకరత్, సుభాషిణి అలీ, బివి రాఘవులు, అశోక్ ధావలే, ఎంఎ బేబీ, ఎ. విజయరాఘవన్, రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ కేరళను కార్పొరేట్, హిందూత్వ బంధానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనకు కోటగా అభివర్ణించారు. సమానత్వం, న్యాయం, లౌకికవాదం కోసం పోరాటంలో కేరళ దేశానికే ఆశాకిరణంగా ఉందన్నారు. నయా ఉదారవాద పెట్టుబడిదారీ దోపిడీ శక్తులను నేరుగా సవాలు చేసే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు సిపిఎం అచంచలమైన నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. కార్మిక వర్గాన్ని విభజించి, నిరంకుశ పాలనతో పెరుగుతున్న హిందూత్వ, మతతత్వాలను నిరోధించడానికి, లౌకిక విలువలను నిలబెట్టడానికి వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు.

మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం సామాజిక విభజనలను తీవ్రతరం చేస్తోందని, ప్రజలను పోలరైజ్ చేసేందుకు మతపరమైన ద్వేషాన్ని తీవ్రతరం చేస్తోందని విమర్శించారు. దేశం నయా ఫాసిజంలోకి దిగజారకుండా నిరోధించడానికి విస్తృత, ఐక్య కూటమి ఏర్పాటుకు పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పార్టీ స్వతంత్ర వైఖరిని పునరుద్ఘాటించారు.

## జైలు నుండి విడుదల కానున్న యూన్ సుక్ యోల్



డిసెంబర్ 3న యూన్ సైనిక పాలన విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంటు తిరస్కరిస్తూ ఓటు వేయడంతో ఆరుగంటల తర్వాత ఆ డిక్రీని ఎత్తివేశారు. సైనిక పాలన విధించి తన రాజ్యాంగ విధిని ఉల్లంఘించారంటూ ప్రతిపక్ష నేతృత్వంలోని పార్లమెంటు ఆయనను అభిశంసించింది.

సియోల్ : అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్‌ను జైలు నుండి విడుదల కానున్నారు. ఆయనను జైలు నుండి విడుదల చేయాల్సిందిగా సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఇతర దక్షిణ కొరియా మీడియాలు కూడా ఈ నివేదికను ప్రచురించాయి. యూన్ జైలు నుండి వెంటనే విడుదలై నిర్బంధంలో లేకపోతే విచారణలో పాల్గనే అవకాశం ఉందని మీడియా తెలిపింది. దక్షిణ కొరియాలో చట్టపాలన కొనసాగుతోందని యూన్ న్యాయవాది పేర్కొన్నారు. జనవరి 19న యూన్‌కి జారీ చేసిన వారెంట్ చెల్లదని, ప్రాసిక్యూటర్లు దాఖలు చేసిన అభ్యర్థన విధానపరంగా లోపభూయిష్టంగా ఉందని యూన్ న్యాయవాదులు వాదించారు. దేశవ్యతిరేక శక్తులను నిర్మూలించేందుకంటూ ప్రతిపక్షాలు

### రెండువారాల్లో వ్యోమగాములను భూమిపైకి తీసుకువస్తాం

వాషింగ్టన్ : నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను త్వరలో భూమి మీదకి తీసుకువస్తామని అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించారు. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ ఇద్దరు వ్యోమగాములు తిరిగి వచ్చినపుడు, వారిని పలకరించడానికి తాను సిద్ధంగా ఉంటానని ట్రంప్ అన్నారు. ఓవల్ ఆఫీసులో గురువారం కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం. తీసుకువెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపామని అన్నారు. వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే బాధ్యతను ఎలన్ మస్క్‌ఉ అప్పగించినట్లు తెలిపారు. రాబోయే రెండువారాల్లో మస్క్ వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకువచ్చే స్పేస్ ఎక్స్ క్యాప్సూల్‌ను సిద్ధం చేస్తున్నారని అన్నారు.

## బందీలను విడుదల చేయకపోతే మీ అంతు చూస్తాం!

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గాజాపై బెదిరింపులకు దిగారు. మిగిలిన బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని, ఇప్పటివరకు హత్యకు గురైన వారి మృతదేహాలను అప్పగించాలని, లేనిపక్షంలో మీ అంతు చూస్తామని ట్రంప్ బుధవారం హమాస్ నేతలను బెదిరించారు. హమాస్ నేతలందరూ గాజా విడిచి పారిపోవాలని హుకుం జారీ చేశారు. గాజాపై విధ్వంసానికి దిగిన ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూ, పని పూర్తి చేయడానికి ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలను పంపుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్‌లో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన బందీలను కలిసిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. "ఇదే మీకు చివరి హెచ్చరిక. గాజాను వదిలి వెళ్లాల్సిన సమయం వచ్చింది" అని హమాస్ నేతలను బెదిరించారు. 'గాజా ప్రజల కోసం మంచి భవిష్యత్తు ఎదురు చూస్తోందని, కానీ మీరు బందీలను విడుదల చేయకుంటే గాజా అంతటా పరిణామాలు తీవ్రంగా వుంటాయి' అని అన్నారు.

మిగిలిన బందీలను హమాస్ అప్పగించకపోతే ఊహించలేని పరిణామాలు వుంటాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## బెయిల్ వంటి కేసుల్లో విచారణ తేదీలను పొడిగించొద్దు



న్యూఢిల్లీ : బెయిల్ ఇచ్చే కేసుల్లో సుదీర్ఘమైన విరామం వుండేలా విచారణ తేదీలు నిర్ణయించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. వైద్య సంబంధమైన కారణాలపై తాత్కాలికంగా బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషన్‌పై విచారణను పంజాబ్ హర్యానా హైకోర్టు రెండు నెలల తర్వాత నిర్ణయించిందని పిటిషన్‌దారు తెలియజేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన క్లయింట్ రెండేళ్ల కుమార్తెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి వున్నందున ఆమెకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్‌దారు హైకోర్టును ఆశ్రయించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. హైకోర్టులో ఫిబ్రవరి 21న విచారణ జరిపి ఈ విషయాన్ని ఏప్రిల్ 22కు పోస్ట్ చేశారు. "స్వేచ్ఛను కల్పించడం వంటి అంశాల్లో కోర్టులు మరీ ఎక్కువ కాలంపాటు సాగదీయరాదని బెంచ్ వ్యాఖ్యానించింది. త్వరితగతిన విచారణ జరిపేందుకు పిటిషనర్ హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతించింది. కనీసం ఇలాంటి విషయాల్లోనైనా ముందుగా విచారించేలా చూడాలని బెంచ్ హైకోర్టును కోరింది. హైకోర్టులో తన క్లయింట్ రెగ్యులర్ బెయిల్ పెండింగ్‌లో వుందని, విచారణ తేదీని ముందుకు జరపాలన్న క్లయింట్ దరఖాస్తును తిరస్కరించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. తాజా వ్యాఖ్యల నేపథ్యంలో కూడా హైకోర్టు దీన్ని తిరస్కరిస్తుందని మీరు భావిస్తున్నారా అని జస్టిస్ గవారు ప్రశ్నించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో అంతుపట్టని వ్యాధి.. ఒకే నెలలో 13 మంది మృతి

జార్ఖండ్ ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ధనికోర్తా గ్రామంలో ఒకే నెలలో 13 మంది మృతి చెందారని తెలియగానే వైద్య విభాగం అప్రమత్తమైంది. ధనికోర్తాలో వైద్య సేవలు అందిస్తోంది. బాధితుల్లో ఛాతినొప్పి , విడవకుండా దగ్గు వంటి లక్షణాలు కనిపించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఒడిశా సరిహద్దుకు సమీపంలో ఉన్న ఆ గ్రామంలో దాదాపు ప్రతి ఇంటి లోని వ్యక్తులు ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నట్టు వెల్లడించాయి. ఈ వ్యాధి వార్తలపై సుక్మా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కపిల్‌దేవ్ కశ్యప్ మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజులుగా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. వారిలో ముగ్గురు వృద్ధాప్య సమస్యలతో చనిపోయారు. మిగతా ఇద్దరి మృతికి కారణాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు గుర్తించిన దాని ప్రకారం వాతావరణంలో మార్పులు, మహువా పంట సేకరణ కారణాలు కావొచ్చని చెప్పారు. ఈ పంట సేకరణ నిమిత్తం గ్రామస్తులు రోజంతా అటవీ ప్రాంతం లోనే ఉంటారు. దాంతో వారు డీహైడ్రేషన్‌కు గురై అనారోగ్యానికి పాలవుతున్నారని తెలిపారు.

# చక్కని ఆరోగ్యం


## సొరకాయ ఆరోగ్య ప్రయోజనాలు...



సొరకాయ అనేది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కూరగాయ. దీని అధిక నీటిశాతం, పీచు పదార్థం, యాంటీఆక్సిడెంట్లు శరీరానికి మంచి పోషకాలను అందిస్తాయి. బరువు తగ్గడానికి, జీర్ణక్రియ మెరుగుపరచడానికి, గుండె ఆరోగ్యానికి, చర్మ సౌందర్యానికి ఇది ఉపయోగకరం. రోజువారీ ఆహారంలో దీన్ని చేర్చుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. సొరకాయ అనేది పౌష్టిక విలువలతో నిండిన అద్భుతమైన కూరగాయ. దీని అధిక నీటిశాతం, పీచు పదార్థం, పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్ల వల్ల ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది. రోజువారీ ఆహారంలో సొరకాయను చేర్చడం ద్వారా శరీరానికి పలు ప్రయోజనాలు పొందవచ్చు. సొరకాయలో 90 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. ఇది ముఖ్యంగా వేడి వాతావరణంలో శరీరాన్ని తగినంత హైడ్రేటెడ్‌గా ఉంచేందుకు మంచి కూరగాయ. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. డీహైడ్రేషన్ సమస్యలు కూడా దూరంగా ఉంటాయి. సొరకాయలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రేగుల కదలికలను మెరుగుపరచి మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. మంచి జీర్ణక్రియ కోసం సొరకాయ సహాయం చేస్తుంది. దీని వల్ల ప్రేగులలో గట్ మైక్రోబయోమ్ సరిగ్గా పనిచేస్తుంది. సొరకాయ తక్కువ కేలరీలతో, అధిక ఫైబర్‌తో ఉంటుంది. ఇది కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కాబట్టి తిన్న ఆహార పరిమాణాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. సొరకాయ సహజ మూత్రవిసర్జనగా పనిచేస్తూ, అదనపు నీరు, విషపదార్థాలను శరీరంలో నుండి బయటకు పంపుతుంది. సొరకాయ తక్కువ గ్లైసెమిక్ సూచిక కలిగి ఉంటుంది. ఇది మధుమేహం ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఉండే ఫైబర్ గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది. కాబట్టి రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగకుండా కాపాడుతుంది. సొరకాయలో పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇందులో ఉన్న మొక్కల స్టెరాల్స్ గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. సొరకాయ ఆయుర్వేదంలో కాలేయాన్ని రక్షించే లక్షణాల కోసం వాడతారు. ఇది విషపదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. కాలేయ సంబంధిత వ్యాధులు, ముఖ్యంగా కొవ్వు కాలేయ వ్యాధి తగ్గించడంలో సహాయపడుతుంది.

సొరకాయలో కోలిన్ అనే పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు పనితీరుకు మద్దతు ఇస్తుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది. సొరకాయ రసం కొన్నిసార్లు నిద్రలేమి, మానసిక అలసటకు సహజ చికిత్సగా ఉపయోగిస్తారు. సొరకాయలో విటమిన్ సి, జింక్, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మం వృద్ధాప్యాన్ని తగ్గించి, జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. మొటిమలు, చర్మం మంటలను తగ్గించడంలో కూడా ఉపయోగకరంగా ఉంటుంది. సొరకాయ సహజ మూత్రవిసర్జనగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు పంపడంలో సహాయపడుతుంది. మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే మూత్రపిండాల దీర్ఘకాలిక వ్యాధి ఉన్నవారు దీన్ని మితంగా తీసుకోవాలి.

## పుచ్చకాయలు అతిగా తింటున్నారా..!



వేసవి కాలంలో పుచ్చకాయలకు ఫుల్లు డిమాండ్ ఉంటుంది. ఈ సీజన్‌లో ఈ పండును ఎక్కువగా తింటారు. దీని వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో 92శాతం నీరు, 6శాతం చక్కెర ఉంటాయి. వేసవిలో పుచ్చకాయ తినటం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. పుచ్చకాయ శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడంలో సహాయపడుతుంది. శరీరంలో నీటి కొరతను తీరుస్తుంది. అందుకే అందరూ పుచ్చకాయను ఎక్కువగా తింటూ ఉంటారు. పుచ్చకాయను అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. పుచ్చకాయలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది కడుపు ఉబ్బరం, గ్యాస్, డయేరియా వంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమాచారం ప్రకారం, పుచ్చకాయలో మంచి మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది కిడ్నీ సమస్యలను మరింతగా పెంచే అవకాశం ఉంది. పుచ్చకాయను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంలో వాపు వస్తుంది. దీనివల్ల కాలేయం క్రమంగా బలహీనపడుతుంది. మద్యం సేవించే వ్యక్తులు దీని కారణంగా మరిన్ని సమస్యలను ఎదుర్కొంటారు. ఇది మాత్రమే కాదు డయాబెటిస్ సమస్య ఉన్నవారు పుచ్చకాయను పరిమిత పరిమాణంలో తినాలి. ఎందుకంటే ఇందులోని సహజ చక్కెర మీ బ్లడ్‌షుగర్‌ని పెంచుతుంది. పుచ్చకాయను ఎక్కువగా తీసుకుంటే గుండె సంబంధిత సమస్యలు కూడా వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.. వేసవి కాలంలో ప్రతిరోజూ పుచ్చకాయ తినడం వల్ల ఎలక్ట్రోలైట్ సమతుల్యత దెబ్బతింటుంది. ఇది తలనొప్పి, కండరాల బలహీనతకు దారితీస్తుంది. కొంతమందికి పుచ్చకాయ తినడం వల్ల అలెర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. పుచ్చకాయను ఎక్కువగా తినడం వల్ల దద్దుర్లు, చర్మం వాపు, మొటిమలు, దురద వంటి సమస్యలు వస్తాయి. పుచ్చకాయను ఎక్కువగా తినడం వల్ల శరీరం నీటితో నిండిపోతుంది. అధిక హైడ్రేషన్‌తో బాధపడాల్సి వస్తుంది. పుచ్చకాయలో మంచి మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అందువల్ల, పుచ్చకాయను ఎక్కువ మొత్తంలో తినడం వల్ల గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా ఉండాలంటే పుచ్చకాయని తక్కువ మోతాదులో తినడం మంచిది.

## షుగర్ ఉన్నవారు రైస్‌కి బదులుగా రోటీ తింటున్నారా..?




ప్రస్తుత రోజుల్లో షుగర్ సమస్య అనేది చాలా మందిని బాధిస్తున్న సమస్యగా మారింది. ఇది ఒకసారి వచ్చాక దాన్ని కంట్రోల్ చేయడం చాలా కష్టం. అయితే మన ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని కొంత వరకు నియంత్రించుకోవచ్చు. చాలా మంది రెగ్యులర్‌గా అన్నం తినడం తగ్గించి బదులుగా రోటీలను తీసుకోవడం మొదలుపెడుతున్నారు. ఎందుకంటే రైస్‌లో ఉన్న అధిక కార్బోహైడ్రేట్స్ రక్తంలో షుగర్ లెవల్స్‌ను ఒక్కసారిగా పెంచేస్తాయి. అందుకే రోటీ తినడం ద్వారా అదుపులో ఉంచవచ్చని భావిస్తున్నారు. కానీ రోటీని కూడా తగిన విధంగా తయారు చేసుకోవాలి. అలా చేయకపోతే రోటీ తిన్నా ప్రయోజనం ఉండకపోవచ్చు. చాలా మంది మార్కెట్లో దొరికే పిండి ఉపయోగించి రోటీలు తయారు చేస్తారు. కానీ కొన్ని బ్రాండెడ్ పిండుల్లోనూ కల్తీ ఉండే అవకాశం ఉంది. అందువల్ల గోధుమలతో నిత్యం స్వచ్ఛమైన పిండిని తయారు చేసుకొని రోటీలు చేయడం ఉత్తమం. నిజమైన గోధుమ పిండితో చేసిన రోటీలు రక్తంలో గ్లూకోజ్‌ను తక్కువ వేగంతో అబ్జార్బ్ చేస్తాయి. అంటే రక్తంలో షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పెరగకుండా నియంత్రితంగా ఉండేలా చేస్తాయి. అంతేకాకుండా ఈ పిండిలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియ బాగా మెరుగవుతుంది. కేవలం గోధుమ పిండితో కాకుండా రోటీల పోషక విలువలను మరింత పెంచేందుకు కొన్ని ప్రత్యేకమైన పదార్థాలను కలపాలి. ఉదాహరణకు బాదం పిండి, కొబ్బరి పిండి, శనగపిండి వంటి లో-కార్బ్ పిండులను గోధుమ పిండిలో మిక్స్ చేస్తే మరింత ఆరోగ్యకరంగా మారుతాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ లెవల్స్‌ను నియంత్రించడంతో పాటు ప్రోటీన్లను అందిస్తాయి. బాదం పిండిలో హెల్తీ ఫ్యాట్స్, ప్రోటీన్లు ఉంటాయి. ఇవి బ్లడ్ షుగర్ లెవల్స్‌ను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. రోటీలను మరింత ఆరోగ్యంగా మార్చేందుకు అవిసె గింజల పొడి లేదా చియా విత్తనాల పొడిని ఉపయోగించవచ్చు. ఈ విత్తనాల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విత్తనాలను మెత్తగా పొడి చేసి తక్కువ పరిమాణంలో పిండిలో కలిపి రోటీలు తయారు చేసుకోవచ్చు. కావాలంటే ఎంతైనా ఆరోగ్యకరంగా రోటీలను తయారు చేసుకోవచ్చు. కానీ వాటిని తినే విధానం కూడా చాలా ముఖ్యం. ఎక్కువ పరిమాణంలో తినడం వల్ల రక్తంలో షుగర్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే పెద్ద రోటీల బదులుగా చిన్న సైజ్ రోటీలను తినాలి. దీనికి తోడు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు, కూరగాయలను కూడా భోజనంలో చేర్చాలి. ఇలా చేయడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవచ్చు. రోటీలను తినేటప్పుడు దానితో పాటు తీసుకునే కూరలు కూడా చాలా ముఖ్యం. ఎక్కువగా కూరగాయలతో తయారు చేసిన సబ్జీలు, పెసరపప్పు, శనగపప్పు వంటి ప్రోటీన్ ఫుడ్‌ను రోటీతో కలిపి తింటే మరింత ఆరోగ్యకరంగా ఉంటుంది.

## పండ్లు ఈ టైంలో తిన్నారంటే ఒంట్లో విషంగా మారుతాయ్..



ఖాళీ కడుపుతో నీళ్లు, కడుపు నిండిన తర్వాత పండ్లు తినాలని పెద్దలు చెబుతుంటారు. కానీ ఇలా చేస్తే డేంజర్ అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి పండ్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పండ్లు తినడానికి ఒక పద్ధతి ఉంది. అలా కాకుండా ఎలాపడితే అలా తినేస్తే మంచికి బదులు శరీరానికి హాని కలిగించే అవకాశమే ఎక్కువగా ఉంటుంది. ఎల్లప్పుడు భోజనం తిన్న తర్వాత మాత్రమే పండ్లు తినాలని నిపుణులు అంటున్నారు. వాస్తవానికి ఇది నిజం కాదు. ఆయుర్వేదం ప్రకారం సరైన నియమాలను పాటించకుండా పండ్లు తినడం ఒంట్లో విషపూరితంగా మారవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే వివిధ ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయి. భోజనం తర్వాత పండ్లు తినడం వల్ల అసిడిటీ సమస్యలు వస్తాయి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్ష వంటి పుల్లని పండ్లు కడుపులో ఆమ్ల స్థాయిలను పెంచుతాయి. దీనివల్ల ఆమ్లత్వ సమస్యలతో బాధపడతారు. ఆమ్లం పెరుగుదలకు పుల్లని పండ్లు కారణమవుతాయి. ఆహారంతో పాటు పండ్లు తినడం వల్ల తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. పండ్లలో ఉండే ఆమ్లం, చక్కెర తలనొప్పికి కారణమవుతాయి. సిట్రస్ పండ్లలో ఆక్టోపమైన్ ఉంటుంది. ఇది తలనొప్పికి కారణమవుతుంది. మీకు మైగ్రేన్ సమస్య ఉంటే, సిట్రస్ పండ్లు, అవకాడోలు, రాస్ప్బెర్రీస్, రేగు పండ్లు, అత్తి పండ్లు, డ్రై ఫ్రూట్స్ తినకపోవడమే మంచిది. భోజనం తర్వాత పండ్లు తినడం వల్ల శరీరంలో విష పదార్థాలు పేరుకుపోతాయి. దీనివల్ల గ్యాస్, ఆమ్లత్వం, అజీర్ణం, మలబద్ధకం వంటి అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్ల ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. పండ్లలో ఉండే ఫైబర్ పోషకాల శోషణకు ఆటంకం కలిగిస్తుంది. భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం వల్ల శరీరంలో పోషకాల శోషణ తగ్గుతుంది. ఫలితంగా, ఆహారంలోని పోషక విలువలు కోల్పోతాయి. ఆహారంతో పాటు లేదా కడుపు నిండా పండ్లు తినడం వల్ల కూడా జీర్ణ సమస్యలు వస్తాయి. భోజనం తర్వాత పండ్లు తినడం వల్ల జీర్ణక్రియ తగ్గుతుంది. ఇది జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఆహారాన్ని జీర్ణం చేయడం కష్టతరం చేస్తుంది.

## ఆహారంలో, తాగే నీటిలో మైక్రోప్లాస్టిక్‌లు..!



మైక్రోప్లాస్టిక్‌లు మనం తినే ఆహారంలో, తాగే నీటిలో ఉంటాయన్న విషయం మీకు తెలుసా..? ఇవి చాలా చిన్న కణాలుగా ఉండి మన శరీరంలో చేరే అవకాశం ఉంది. కానీ కొన్ని చిన్న మార్పుల ద్వారా మైక్రోప్లాస్టిక్‌ల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. మైక్రోప్లాస్టిక్‌లు మన ఆహారం నీటిలో ఉన్నాయని మీకు తెలుసా..? వీటిని పూర్తిగా నివారించడం కష్టమే.. కానీ కుళాయి నీరు త్రాగడం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ ఆహారాన్ని తగ్గించడం, తక్కువ ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల ఈ ఎక్స్‌పోజర్‌ను తగ్గించవచ్చు. ఈ చిన్న మార్పులు మీ ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుతాయి. మైక్రోప్లాస్టిక్‌లు మనం తీసుకునే గాలి, నీరు, ఆహారంలోనే కాకుండా మన రక్తం, ఊపిరితిత్తులు, మెదడులో కూడా చేరుతాయని పరిశోధకులు కనుగొన్నారు. వీటిని పూర్తిగా నివారించడం అసాధ్యం అయినప్పటికీ.. తీసుకునే మైక్రోప్లాస్టిక్‌ల పరిమాణాన్ని తగ్గించడానికి కొన్ని దశలు ఉన్నాయి. వాషింగ్టన్ పోస్ట్ ప్రకారం.. బాటిల్ నీటిలో మైక్రోప్లాస్టిక్‌ల భారీ వనరులు ఉన్నాయని తేలింది. ఒక లీటరు బాటిల్ నీటిలో 240,000 చిన్న ప్లాస్టిక్ ముక్కలు ఉంటాయని తేలింది. ఇవి కనబడనంత చిన్నవి. కుళాయి నీటిలో కూడా మైక్రోప్లాస్టిక్‌లు ఉంటాయి. కానీ తక్కువ పరిమాణంలో ఉంటాయి. కుళాయి నీరు బాటిల్ నీటితో పోలిస్తే ఎక్కువ సురక్షితంగా ఉంటుంది. మంచి నీటి ఫిల్టర్ 90 శాతం వరకు మైక్రోప్లాస్టిక్‌లను తొలగించగలదు. కానీ ప్లాస్టిక్ పైపులు లేదా కంటైనర్‌లను వేడి చేయడం ద్వారా విషపూరిత రసాయనాలు విడుదల అవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది ప్లాస్టిక్ కంటైనర్లలో ఆహారాన్ని నిల్వ చేసి మైక్రోవేవ్‌లో వేడి చేస్తారు. ఇది ప్రమాదకరం. ప్లాస్టిక్ వేడి చేయడం వల్ల మిలియన్ల కొద్దీ మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరుతాయి. బదులుగా గాజు లేదా సిరామిక్‌లను ఉపయోగించడం ఉత్తమం. నైలాన్ టీ బ్యాగులు వేడి నీటిలో నానబెట్టినప్పుడు పెద్దమొత్తంలో మైక్రోప్లాస్టిక్ కణాలు విడుదలవుతాయి. దీని వల్ల ప్రతి కప్పులో చిన్న ప్లాస్టిక్ ముక్కలు ఉంటాయి. కనుక టీ బ్యాగులకి బదులుగా లూజ్-లీఫ్ టీ వాడటం ఉత్తమం. మైక్రోప్లాస్టిక్‌లు ప్రతి చోటా ఉన్నప్పటికీ.. తాజా ఆహారం తీసుకోవడం, గాజు కంటైనర్లు వాడటం, ఫిల్టర్ చేసిన నీరు త్రాగడం వంటి మార్పులు ఎక్స్‌పోజర్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

## ఖాళీ కడుపుతో యాపిల్ తింటున్నారా..



ఒక్కో పండుకు ఒక్కో రకమైన ఆరోగ్య ప్రయోజనాన్ని కలిగించే గుణం ఉంటుంది. అందులోనూ ఖరీదైన పండుగా భావించే యాపిల్స్ ను కచ్చితంగా రోజుకి ఒకటైనా తినాలంటారు. అయితే ఈ పండును ఏ సమయంలో తీసుకోవాలనేది కూడా చాలా ముఖ్యమట. ఒక్కో సమయంలో తినడం వల్ల యాపిల్ నుంచి వివిధ రకాల పోషకాలు శరీరానికి అందుతాయని అంటున్నారు. రోజుకో యాపిల్ పండు తింటే డాక్టర్ తో పనిలేదంటారు. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. యాపిల్ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తులు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయే కఫాన్ని కరిగిస్తాయి. దీంతోపాటు ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీని వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు రావు. అలాగే దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. ఖాళీ కడుపుతో ఆపిల్ తినడం వల్ల శరీరం ఆపిల్‌లోని ముఖ్యమైన పోషకాలను సులభంగా గ్రహించగలదు. వాటిలో ప్రోటీన్, ఐరన్ మరియు విటమిన్లు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మీ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. మీరు మీ బరువును నియంత్రించుకోవాలనుకుంటే, ఉదయం ఖాళీ కడుపుతో ఒక ఆపిల్ తినండి. ఇందులో ఉండే ఫైబర్ ఎక్కువసేపు ఆకలిని అణిచివేస్తుంది. ఇది అతిగా తినడం నిరోధిస్తుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది

యాపిల్స్‌లో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో ఒక ఆపిల్ తినడం వల్ల కడుపు శుభ్రంగా ఉండి జీర్ణవ్యవస్థ బలోపేతం అవుతుంది. యాపిల్స్‌లో ఫైబర్, విటమిన్ సి మరియు పొటాషియం ఉంటాయి. అవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఈ విటమిన్లు రక్తపోటును నియంత్రిస్తాయి. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ఆపిల్ తొక్కలో క్వెర్సెటిన్ అనే ఫ్లేవనాయిడ్ ఉంటుంది. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దీన్ని తొక్కతో కలిపి తినడం మంచిది. దీనివల్ల శరీరానికి ఉపశమనం లభిస్తుంది.

ఖాళీ కడుపుతో ఆపిల్ తినడం వల్ల శరీర రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఇందులో విటమిన్ సి మరియు ఇతర పోషకాలు ఉంటాయి. అవి శరీరానికి వ్యాధులతో పోరాడటానికి బలాన్ని ఇస్తాయి. ఆపిల్ తినడానికి ఉత్తమ సమయం ఉదయమే అంటున్నారు నిపుణులు. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, జీర్ణక్రియకు సహాయపడుతుంది. ముఖ్యంగా పెక్టిన్, ఇది ప్రేగు కదలికలను ప్రేరేపించడంలో సహాయపడుతుంది మరియు ఉదయాన్నే తింటే శరీరం దీని పోషకాలను బాగా గ్రహించగలుగుతుంది.

# ఈ నెల 9న కొత్తగూడెం జరిగే మున్నూరు కాపు సంఘం సభను జయప్రదం చేయండి....

మున్నూరు కాపు మండల అధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య....



చంద్రుగొండ, మార్చి 07 ( వుదయం ప్రతినిధి) : మండల కేంద్రంలో మండలం మున్నూరు కాపు సంఘం సమావేశం మండల కమిటీ అధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య, జిల్లా కమిటీ బాధ్యులు బాలిశెట్టి సుందర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ.... ఈ నెల 9వ తారీఖున కొత్తగూడెంలో జరగబోయే మున్నూరు కాపు సంఘం సమావేశానికి మండలం నుంచి పెద్ద ఎత్తున మున్నూరు కాపు లు హాజరుకావాలని, మున్నూరు కాపులు రాజ్యాధికారని సాధనకై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, బీసీ ఉద్యమంలో కూడా మున్నూరు కాపులు పెద్దన్న పాత్ర పోషించాలన్నారు.. పాలకులు మున్నూరు కాపుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేయటం తగదన్నారు. మున్నూరు కాపులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు తోటరాజు, ఉప్పు శ్రీనివాసరావు, బండి విజయ భాస్కరరావు, లంకా నరసింహారావు, నియోజకవర్గ బాధ్యులు ప్రకాష్ రావు, మండల కమిటీ బాధ్యులు వెలగల మధు, అంచ కృష్ణ, కుసాల లక్ష్మీపతి, శెట్టిపల్లి కృష్ణయ్య, గోరంట్ల శ్రీనివాస్, ఆళ్ల శ్రీనివాస్, ఆకుల శ్రీనివాసరావు, ఉ షికల దయాకర్, రామిశెట్టి వెంకటేశ్వర్లు,

భూపతి రమేష్, భూపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు...

# హామీలు నెరవేర్చి ఉద్యమకారులకు బంధువుగా మారాలని ముఖ్యమంత్రికి ఉత్తరం



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చి ఉద్యమకారులకు బంధువుగా మారాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు ఉత్తరం రాశారు శుక్రవారం మహాదేవపూర్ మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి అయుబుద్దిన్ ఆధ్వర్యంలో ఉ ద్యమకారులు సమావేశం ఏర్పాటు చేసుకొని సమావేశానంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కి విన్నవించుకుంటూ అంటూ అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలతో పాటుగా అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉద్యమకారుల బంధువుగా మారాలని కోరుచున్నామని తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 250 గజాల ఇంటి స్థలం 25 వేల రూపాయల పెన్షన్ అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల బడ్జెట్ ను కేటాయించాలని ఉద్యమకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉత్తరం రాశారు, ఈ కార్యక్రమంలో మేసినేని వెంకటేశ్వరరావు, పేరాల కేశవరావు, కొరిపెల్లి ప్రశాంత్ రావు, మేసినేని గోపాల్ రావు, ఠాకూర్ రమేష్ సింగ్, కొరిపెల్లి రామకృష్ణ, మేసినేని దేవేందర్, కొరిపెల్లి కృష్ణారావు, పిడుగు సమ్మయ్య పిడుగు రమేష్, పాల్గొన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి అయుబుద్దిన్ తెలిపారు.

## దళిత బంధు మరియు అంబేద్కర్

### అభయ హస్తం పథకం అమలు చేయాలని ధర్నా నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



నారాయణఖేడ్ మార్చి 07(వుదయం ప్రతినిధి) పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల అప్పుడు వారి మేనిఫెస్టోలు పెట్టినట్లుగా దళిత గిరిజనులకు అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ఇస్తామని చెప్పిన 12 లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని లిగౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను మరియు గిరిజనులను మోసం చేసింది అని తెలిపారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితులకు మూడు లక్షల చొప్పున వారి అకౌంట్లో జమ చేసిన డబ్బులను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం తగదు. అని వాటిని మరియు వాటితో పాటు మిగిలిన దళితబంధు డబ్బులను లబ్ధిదారులైన దళితులకు చెల్లించాలని తెలిపారు. అలాగే మీరు అమలు చేస్తామన్న అంబేద్కర్ అభయ హస్తం పథకం కూడా వెంటనే అమలు చేయాలని తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, విఠల్ రావు పటేల్, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు అభిషేక్ షెట్కార్,విఠల్,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మున్సిపల్ కోఆప్షన్ గోపాల్, మాజీ సర్పంచ్లు సంగప్ప, చెన్ బసప్ప,వెంకటేశం, సుదర్శన్, విజయ్,దత్తు,రాజు నాయక్,సల్మాన్,ప్రసాద్,జైపాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు భూపాల్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు దళిత నాయకులు విశ్వనాథ్,టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు అంజా గౌడ్,కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ,యువత అధ్యక్షులు మచ్చేందర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు నర్సింలు ముదిరాజ్, నర్సింలు యాదవ్, నాయకులు ప్రసాద్,విఠల్ రెడ్డి,పోచయ్య,శివ కుమార్,సర్దార్,రాజు,శ్రీనివాస్,సందీప్ తదితరులు పాల్గొన్నారు

# పదవ తేదీన జరిగే ఐటిఐ అప్రెంటిస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఐ ఎన్ టి యు సి కేజియం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 07 (వుదయం ప్రతినిధి) కొత్తగూడెం గవర్నమెంట్ ఐటిఐ కళాశాలనందు అప్రెంటిషిప్ ల కోసం టాటా అడ్వాన్స్ సిస్టం హైదరాబాద్, మేధా సర్వో డ్రైవ్ హైదరాబాద్ ,ఎల్ అండ్ టి హైదరాబాద్, ఆర్ టి సి, బిఈ ఎల్ వంటి వివిధ కంపెనీలతో రుద్రంపూర్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఐటిఐ అప్రెంటిన్ మేళా నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

ఐటిఐ ఫిట్టర్ ఎలక్ట్రిషన్, వెల్డర్, టర్నర్ ,మెషినిస్ట్, మోటార్ మెకానిక్ ,డీజిల్ మెకానిక్ అప్రెంటిషిప్ ట్రేడ్లలో ఎంపిక చేసి అప్రెంటిన్ షిప్ కి తీసుకుంటారని అన్నారు. ఉదయం 9 గంటలకు కొత్తగూడెం గవర్నమెంట్ ఐటిఐ వద్దకు, ఐటిఐ పాసై ఉండి అర్హత గల అభ్యర్థులు సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, బయోడేటా ఫామ్, 6 ఫోటోలు వెంట తీసుకొని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి , పరిసర ప్రాంతాలతోపాటు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగాఉన్న ఐటిఐ పాసైన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటిఐ నోడల్ ఆఫీసర్ రమేష్ గారు తెలుపుతూ సింగరేణి లో గాని, గవర్నమెంట్ లో గాని, ప్రవేట్ కంపెనీస్ లో గాని అప్రెంటిషిప్ చేసిన అన్ని సమానమని తెలిపారు. ఈ సందర్భంగా ఐ టి ఐ నోడల్ ఆఫీసర్ రమేష్ ని కలిసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఐటిఐ అప్రెంటిషిప్ జరగనున్న ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు.

# జిపి కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి. ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం.



కార్మికుల సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ పాషా.

ఖానాపురం మార్చి 7 వుదయం ప్రతినిధి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.కె ఉస్మాన్ పాష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవో సునీల్ కుమార్ రాజ్ అందుబాటులో లేనందున సూపర్డెంట్ వెంకటేశ్వర్ రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జిపి కార్మికుల పెండింగ్ వేతనలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వెంటనే చెల్లిస్తామని చెప్పి నేటి వరకు పెండింగ్ వేతనలు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల ఉపాధ్యక్షుడు వెంగళ శీను, కార్యదర్శి బిక్షపతి, సంఘం సభ్యులు వెంకటమ్మ, ప్రసన్న, పార్వతి, సోమక్క, నరసయ్య, కవిత, రమేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్ బెల్లంపల్లి, మార్చి07 (వుదయం ప్రతినిధి) తాండూరు మండలంలోని అచులపూర్, తాండూరు, రేచిని గ్రామాల్లో బెల్లంపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్, మండల వ్యవసాయ అధికారి సుస్మా తో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ఫర్టలైజర్ షాపులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులను, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురుగు మందుల నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని డీలర్ల కు సూచించారు. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువుల విక్రయాలు కొనసాగించాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏఈవోలు అందుబాటులో ఉండి, రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలన్నారు.

# కళ్యాణ మహోత్సవంలో హాజరైన అంజయ్య స్వామికి సేత్కారం .



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 7 వుదయం ప్రతినిధి:

రాజపేట మండలం రేణిగుంట గ్రామ పరిధిలోని శ్రీగిరి శ్రీ సంకల్ప సిద్ధి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రధమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వంగపల్లి అంజయ్య స్వామి హాజరయ్యారు. కూర నాగరాజు కటకం శ్రీనివాస్ కటకం వీణ, ఆలయ కమిటీ సభ్యులు కూర బద్రీనాథ్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య స్వామిని సత్కరించారు.

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం...




బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కుత్బుల్లాపూర్, మార్చి 7,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ లోని సప్తపది గార్డెన్స్ లో ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఇంట్లో ఒక పురుషుడు చదువుకుంటే ఆ ఇళ్లు మాత్రమే అభివృద్ధి చెందుతుందని, అదే ఒక మహిళ చదువు ఆ కుటుంబంతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడుతుందని, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినపుడే దేశాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్లు ప్రణయ ధన్ రాజ్ యాదవ్, విజయలక్ష్మి, గాజుల సుజాత, ఆదర్శ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చలసాని భారతి, శ్రీలత, పద్మ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఒక్కరోజు ఉపాధ్యాయులైన వేళ. ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం.




పాఠశాల హెచ్ఎం అశోక్.

ఖానాపురం మార్చి 7 వుదయం ప్రతినిధి. విద్యార్థులే ఒకరోజు ఉపాధ్యాయులై విద్యను బోధించడం ఎంతో సంతృప్తిగా ఉందని ఉపాధ్యాయులైన విద్యార్థులు తెలిపారు. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం కె అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాల హెచ్ఎం గా షేక్ పుఫీనా బేగం, ఉపాధ్యాయులు ఎస్. కె అతీయా కౌసర్, జె శ్రావ్య ,తేజావత్ వనిత ప్రియ, తేజావత్ సుప్రియ, చైత్ర, నఫీస బేగం, మహేష్, బిట్టు, శ్రీరామ్, నాగేష్, భవిష్యతోపాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం వాంకుడోత్ వాగ్య, భూక్యా వీరన్న, వొల్లాల అశోక్, బిల్ల వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భూక్య ధర్మి , అంగన్వాడీ టీచర్ తేజావత్ కవిత విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాసభకు అధిక సంఖ్యలో పద్మశాలీలు హాజరు కావాలి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 07(వుదయం ప్రతినిధి)

హైదరాబాదులోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఈనెల 9తేదీ ఆదివారం జరిగే 17 వ అఖిలభారత పద్మశాలి సంఘం మహాసభ మరియు ఎనిమిదవ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో పద్మశాలీలు హాజరై పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గోనె భాస్కర్ కోరారు. శుక్రవారం భూపాలపల్లి రెడ్డి కాలనీ మంజునాథ టెక్స్టైల్స్ వద్ద హలో పద్మశాలి చలో హైదరాబాద్ అనే పోస్టర్ ని జిల్లా అధ్యక్షులు గోనె భాస్కర్ ఆధ్వర్యంలో పద్మశాలి జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హక్కుల సాధనకు పద్మశాలీలంతా ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలుపుతూ, రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. ఈ సభకి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. ఈ బహిరంగ సభకి జిల్లాలోని అన్ని మండలాల నుండి పద్మశాలీలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు షేర్ కుమార్, భీమనాథుని సత్యనారాయణ, క్యాతం సతీష్ కుమార్ పానిగంటి శ్రీనివాస్,కొండబత్తుని మార్కండేయ, పల్నాటి రవీందర్, రాచర్ల చంద్రమౌళి, గుండేటి శ్రీనివాస్, పెనుమల్ల రమేష్, కుసుమ చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రేణికుంట శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం

## పల్లకీ సేవా మహోత్సవం.



ఘనంగా రేణికుంట శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం. నేడు పల్లకీ సేవా మహోత్సవం. యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 7 వుదయం ప్రతినిధి:

రాజపేట మండలం రేణిగుంట శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేలాదిమంది భక్తజనుల మధ్య జరిగింది. స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా దేవస్థానం కమిటీ సభ్యుల భక్తుల ఆధ్వర్యంలో వేద పండితులు వైదిక కార్యక్రమ నిర్వాహకులు యజ్ఞచార్య శ్రీ పాంచరాత్ర ఆగమ పండితులు వైదిక రత్న ప్రవచనా శిరోమణి కళ్యాణ చక్రవర్తి యాగ్నిక విభూషణ్ శ్రీమాన్ మంగళగిరి నవీన్ ఆచార్యులు వేదమంత్రోచనలతో శ్రీ స్వామి వారి కళ్యాణ తంతును అత్యంత వైభవపేతంగా ఘనంగా నిర్వహించారు.

కళ్యాణ తంతులో అతి ముఖ్య ఘట్టాలలో కన్యాదానం, జన్ధోపవేతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు, వడి బియ్యం విశేషాలను అర్చక స్వాములు వివరించారు. కళ్యాణ అనంతరం భగవత్ భక్తులందరూ హరే రామ హరే కృష్ణ రామనామ సంకీర్తనతో ఆలయ ప్రాంగణం అంతా మారుమోగింది అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఆలయ కమిటీ సభ్యులు గొట్టం రాఘవేందర్ కూర బద్రీనాథ్ ఎల్లారెడ్డి, నాగిరెడ్డి శ్రీనివాసరావు, పలువురు పుణ్య దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవానికి రాజాపేట మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ స్వామివారి కళ్యాణ మహోత్సవం తిలకించి అన్నప్రసాదాలు స్వీకరించి శ్రీ స్వామి వారి అమ్మ వార్ల అనుగ్రహంకు పాత్రులైనారు సాయంత్రం రఘునాధపురం వెంకటేశ్వర భజన మండలి భక్త బృందం భజన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ప్రత్యేక మంటపాన్ని ఏర్పాటు చేశారు విద్యుత్ దీపాలు పూలమాలలు పచ్చని తోరణాలతో అలంకరించారు. శనివారం రోజు పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు చెప్పారు.

# వివాహ వేడుకలకు హాజరైన రాష్ట సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు



యాదాద్రి భువనగిరి/ రాజాపేట, మార్చి 7 వుదయం ప్రతినిధి:

రాజపేట మండలం జాల గ్రామానికి చెందిన కొల్లూరు ఆంజనేయులు కూతురు వివాహ వేడుకలకు రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# సినిమా



## ఓటీటీలో శర్వానంద్ 'మనమే'

శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్టు విక్రమాదిత్య కీలక పాత్రలో నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం ఇది. సుమారు ఏడాది తర్వాత ఓటీటీలోకి రానుంది. ఈమేరకు తాజాగా ప్రకటన కూడా వచ్చేసింది. పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేదు. కానీ, బాక్సాఫీసు వద్ద లాభాలను తెచ్చిపెట్టింది. శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా 'మనమే' సినిమా ఓటీటీ వివరాలను మేకర్స్ ప్రకటించారు. మార్చి 7న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఈ చిత్రం విడుదల కానుందని అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. మనమే చిత్రం విడుదల సమయంలో బాక్సాఫీస్ బరిలో పెద్దగా సినిమాలు లేకపోవడంతో శర్వానంద్‌కు ప్లస్ అయింది. మనమే కథా నేపథ్యం చాలా బాగుంటుంది. ఇందులో వినోదంతో పాటు భావోద్వేగాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి. హీరో శర్వానంద్ బైక్ రేసింగ్‌తో ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు. శర్వా నంద్ హీరోగా అభిలాష్ కంకర్ డైరెక్షన్‌లో 'రేజ్ రాజా' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో మోటారు బైకు రేసర్‌గా శర్వానంద్ నటిస్తున్నారు. 1990 నుంచి 2000ల మధ్య కాలంలో జరిగే ఈ స్పోర్ట్స్ మూవీలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. త్వరలోనే ఈ మూవీని రిలీజ్ చేయాలనుకుంటున్నారు మేకర్స్. ఇదిలా ఉంటే... స్పోర్ట్స్ డ్రామా జానర్‌లో సినిమాలు చేసిన అనుభవం శర్వానంద్‌కు ఉంది. 'మళ్ళీ మళ్లీ ఇది రాని రోజు (2015)' మూవీలో రన్నింగ్ రేసర్‌గా, 'పడి పడి లేచే మనసు (2018)' మూవీలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా శర్వానంద్ నటించి, మెప్పించిన సంగతి తెలిసిందే.

## నాకు పవన్ కళ్యాణ్ గారంటే చాలా ఇష్టం



"నాకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారంటే చాలా ఇష్టం. 'ఖుషి' నాకు బాగా నచ్చింది. ఎన్ని సార్లు చూశానో కూడా లెక్కలేదు. అలాగే, 'పుష్ప'రాజ్ అల్లు అర్జున్ కూడా ఇష్టమే అన్నారు హీరోయిన్ దివ్య భారతి జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించడంతో పాటు నిర్మించిన సినిమా 'కింగ్స్టన్' ఈ శుక్రవారం తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఇండియాలో ఫస్ట్ సి అడ్వెంచర్ థ్రిల్లర్ ఇది. ఇందులో దివ్యభారతి హీరోయిన్ గా నటించారు. 'బ్యాచిలర్' తర్వాత జీవీ ప్రకాష్ కుమార్ సరసన మరోసారి నటించారు. శుక్రవారం సినిమా విడుదల అవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. 'మహారాజా'లో కనిపించింది కాసేపే అయినా నాకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ సినిమా తెలుగులో కూడా బాగా ఆడింది. తమిళంలో ఎంత మంచి పేరు వచ్చిందో... తెలుగులోనూ అంతే మంచి పేరు వచ్చింది. ఆ సినిమాతో కంపేర్ చేస్తే ఇది చాలా డిఫరెంట్ మూవీ. ఇండియాస్ ఫస్ట్ సీ అడ్వెంచర్ థ్రిల్లర్ సినిమా. అందులోనూ జీవీ ప్రకాష్ కుమార్ నిర్మాతగా చేస్తున్న తొలి సినిమా 'కింగ్స్టన్'లో నేను నటించడం సంతోషంగా ఉంది. ఫస్ట్ నాకు ఆఫర్ వచ్చినప్పుడు ఆయన ఒక్కరే నిర్మాత. తర్వాత జీ స్టూడియోస్ వచ్చింది. సినిమా కోసం జీవీ ప్రకాష్ కుమార్ చాలా కష్టపడ్డారు. 'బ్యాచిలర్'లో నేను సిటీ గాళ్ రోల్ చేస్తే... 'కింగ్స్టన్'లో ఒక పల్లెటూరి అమ్మాయి రోల్ చేశారు. చేపలు పట్టడం ఆ ఊరి ప్రజల జీవనాధారం. సముద్ర తీరంలోని ఆ ఊరంతా మత్యకారులు ఉంటారు. వాళ్ళు సముద్రంలో చేపలు పట్టడానికి ఎందుకు వెళ్లడం మానేశారు? వాళ్ళకు ఉన్న శాపం ఏమిటి? దాన్ని హీరో హీరోయిన్లు ఏం చేశారు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. నాది హీరో గాళ్ ఫ్రెండ్ రోల్. ఊరిని కాపాడటం కోసం హీరో ప్రయత్నిస్తే హీరోయిన్ ఎలా సాయం చేసింది? అతనితో సముద్రంలో ఎందుకు వెళ్ళింది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. 'కింగ్స్టన్'ను ఫ్రాంచైజీలో కూడా నా పాత్ర ఉంటుంది. తర్వాత పార్టుల్లో కూడా నా రోల్ కంటిన్యూ అవుతుంది. ఇందులో నేను యక్షన్ సీన్స్ చేశా. చాలా అరుదుగా ఇటువంటి క్యారెక్టర్లు లభిస్తాయి. ఫస్ట్ యాక్షన్ చేయడం కొంత థ్రిల్లింగ్ ఫీలింగ్. ఇందులో నేను రోప్ సీన్స్ చేశా. యాక్షన్ సీన్స్ చేయడం ఎంత కష్టం అనేది తెలిసింది. ఇటువంటి ఛాలెంజింగ్ ప్రాజెక్ట్ మరొకటి నాకు వస్తుందో లేదో తెలియదు. ఆల్రెడీ సినిమా చూశా. హ్యాపీగా ఉన్నాను. ఆడియన్స్ ఎప్పుడు సినిమా చూస్తారా? అని ఎగ్జైటెడ్ గా ఉన్నాను. తమిళంలో రెండు సినిమాలు చేశా. విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. తెలుగులో రెండు ప్రాజెక్ట్స్ డిస్కషన్లో ఉన్నాయి.



## మోహన్ లాల్ సినిమాకు పోటీ కష్టాలు

మలయాళం బ్లాక్ బస్టర్ లూసిఫర్ కొనసాగింపుగా వస్తున్న ఎల్2 ఎంపురాన్ ఈ నెల 27 విడుదలకు రెడీ అవుతోంది. కేరళలో భారీ బిజినెస్ జరుపుకుంటున్న ఈ యాక్షన్ డ్రామాకు ఇతర భాషల్లో పోటీ వల్ల చిక్కులు తప్పడం లేదు. ముఖ్యంగా తెలుగు సంగతి చూస్తే మార్చి 28 నితిన్ రాబిన్ హుడ్, సితార మ్యాడ్ స్క్వేర్ ఒకే రోజు వస్తున్నాయి. బలమైన డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ వల్ల రెండింటికి సరిపడా థియేటర్లకు ఇప్పటి నుంచే అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఇంకోవైపు ఓ రెండు రోజులు అటుఇటు సల్మాన్ ఖాన్ సికందర్ వస్తుంది. దానికి మల్టీప్లెక్సుల కేటాయింపులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చాలవన్నట్టు విక్రమ్ వీరధీర శూరన్ పార్ట్ 2 అదే మార్చి ఇరవై ఏడున దిగుతోంది. మోహన్ లాల్ తో పోల్చుకుంటే టాలీవుడ్ లో విక్రమ్ కే మార్కెట్ ఎక్కువ. సో ప్రాథమిక మద్దతు చియాన్ కే ఉంటుంది. అయితే ఎల్2 ఎంపురాన్ దర్శకుడు పృథ్విరాజ్ సుకుమారన్ తెలుగు ప్రమోషన్, డిస్ట్రిబ్యూషన్ ని తేలిగ్గా తీసుకోవడం లేదట. సలార్, ఎస్ఎస్ఎంబి 29 నటుడిగా తనకు పెరిగిన పాపులారిటీని వాడుకుంటూనే వీలైనంత పబ్లిసిటీ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడని సమాచారం. మైత్రి లేదా ఆసియన్ సురేష్ ఎవరో ఒకరు పంపిణి పరంగా సపోర్ట్ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని సమాచారం. ఇవన్నీ ఎలా ఉన్నా ఎల్2కి మన దగ్గర పెద్దగా బజ్ లేదు. ఎందుకంటే లూసిఫర్ డబ్బింగ్ వెర్షన్ తొలినాళ్లలో ఏపీ, తెలంగాణలో పెద్దగా ఆడలేదు. దాన్నే చిరంజీవి గాడ్ ఫాదర్ గా రీమేక్ చేస్తే యావరేజ్ అయ్యింది. సో ఎల్2 కోసం ఎదురు చూస్తున్న జనాల సంఖ్య తక్కువే.

## మా అమ్మ గురించి అలా రాయొద్దు



'మా అమ్మ గురించి అలా ఊహాజనిత వార్తలు రాయొద్దు. ప్రచారం చేయొద్దు' అని ప్రముఖ గాయని కల్పన కుమార్తె.. మీడియాకు విన్నవించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్పనను అంటిపెట్టుకునే ఉన్నట్టు ఆమె తెలిపారు. అమ్మ ఆరోగ్యం నిలకడగానే ఉంది. దీనిపై అపోహలు ప్రబలేలా మీడియా వ్యవహరించడం సరికాదు. అని ఆమె పేర్కొన్నారు. అంతేకాదు.. తన తల్లి ఆత్మహత్యా యత్నం చేయలేదని ఆమె స్పష్టం చేసింది. మా అమ్మ ఆత్మహత్య చేసుకునేందుకు పిరికి మనస్తత్వంతో లేదు. ఆమె చాలా ధ్రుఢంగా ఉన్నారు. ప్రశాంతత కోసం.. వేసుకునే నిద్రమాత్రల డోస్ కొంచెం ఎక్కువైంది. దీనిపై లేని పోని ప్రచారం చేయడం దారుణం. మా నాన్న-అమ్మ సంతోషంగానే ఉన్నారు. వారి మధ్య ఎలాంటి కలతలు లేవు. కానీ, మీడియాలో ప్రచారం అవుతున్నది వాస్తవం కాదు. ఇలాంటివాటిని ఆపేయండి అని కల్పన కుమార్తె మీడియాకు విజ్ఞప్తి చేశారు. కాగా.. కల్పన దక్షిణాదిలోనే కాకుండా.. ఖవ్వాలీ వంటి ఉత్తరాది సంగీతంలోనూ పేరు తెచ్చుకున్నారు. పంజాబీలోనూ ఆమె చేసే సంకీర్తనలకు ఆయా రాష్ట్రాల్లో మంచిపేరుంది. తాజాగా ఆమె నిద్రమాత్రలు వేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే.



## దేవర 2 ప్లానింగ్ ఎక్కడిదాకా వచ్చిందంటే

గత ఏడాది సెప్టెంబర్ లో విడుదలై బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న దేవరకు కొనసాగింపుకి రంగం సిద్ధమవుతోంది. ఇన్ సైడ్ రిపోర్ట్స్ ప్రకారం దర్శకుడు కొరటాల శివ బృందం గత మూడు నెలలుగా ఆ పని మీదే ఉంది. అసలైన కథ ఇందులోనే ఉంటుందనే తరహాలో ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్ ని ముగించడంతో సీక్వెల్ మీద అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా ఎన్నో ప్రశ్నలకు సమాధానం పార్ట్ 2లోనే చెప్పాల్సి ఉంటుంది. దీనికి టైం పట్టేలా ఉంది కాబట్టి కొరటాల వేరే హీరోతో ఇంకో సినిమా చేస్తాడనే పుకార్లు వచ్చిన నేపథ్యంలో అవేవీ నిజం కాదని తెలిసింది. ఆయన ఫోకస్ మొత్తం దేవర 2 మీదే ఉంది. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే వార్ 2 చివరి దశలో ఉంది. హృతిక్ రోషన్ తో కలిసి చేయాల్సిన పాట షూట్ ఇటీవలే మొదలయ్యింది. ఇంకో వారం రోజుల్లో అయిపోతుంది. చిన్న ప్యాచ్ వర్క్ మినహా దాదాపు పూర్తయినట్టే. ప్రశాంత్ నీల్ డ్రాగన్ సెట్లో ఏప్రిల్ నుంచి రెగ్యులర్ గా అందుబాటులో ఉండబోతున్నాడు. ఇది అక్టోబర్ లేదా నవంబర్ లోగా పూర్తి చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నారు. ఆలా చేస్తేనే 2026 సంక్రాంతి విడుదల సాధ్యమవుతుంది. ఎట్టి పరిస్థితుల్లో మిస్ కాకూడదనేది మైత్రి మూవీ మేకర్స్ లక్ష్యం. ఇవి అయిపోతే తారక్ చేతిలో కొత్త కమిట్ మెంట్స్ లేవు. సో దేవర 2కి మార్గం సుగమం అవుతుంది. ఈ సంవత్సరం చివర్లో లేదా జనవరి నుంచి షూటింగ్ కి వెళ్లిపోవచ్చు. బడ్జెట్ కూడా భారీగా పెంచబోతున్నారు. ఈసారి విలన్ సైఫ్ అలీ ఖాన్ తో పాటు బాబీ డియోల్ కూడా చేరతాడనే ప్రచారం నిజమేనని తెలిసింది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: APTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.